జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 66 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

94402 31967



శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com





# 1.41 కోట్ల మంది అర్హులు

- 2.64 కోట్ల మందికిగాను ఇప్పటివరకు 1.41 కోట్ల మంది అర్హులుగా నిర్ధారణ
- 59,51,696 మంది ఓటర్ల విచారణ పూర్తి.. విచారణకు రాని 31,01,407 మంది ఓటర్లు
- కొత్త ఓటర్ల నమోదుకు 4.43 లక్షలు.. ఓటర్ల తొలగింపునకు 30,676 దరఖాస్తులు



హైదరాబాద్

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)-2026లో భాగంగా నవంబర్ 9న ప్రచురించే తుది ఓటర్ల జాబితా తయారీ కోసం ఎన్నికల సంఘం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఈ జాబితాలో చోటు పొందేందుకు సోమవారం నాటికి మొత్తం 1,41,02,982 మంది ఓటర్లు అర్హత సాధించారు. సర్--2026 ప్రక్రియకు ముందు మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా గత నెల 17న ప్రకటించిన ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,64,87,213కు తగ్గిపోయింది. ఆచూకీ లేరు/శాశ్వతంగా నివాసం మారారు/చనిపోయారు/మరో చోట

# పార్మాసిటీని రద్దు చేయాలి

## మా భూములు మాకు ఇవ్వాలి: రైతులు

ఇబ్రహీంపట్నంలో ప్రజాభవన్ ముట్టడించిన ఫార్మా రైతులు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్.!



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి:** ఫార్మసిటిని రద్దుచేసి మా భూములను మాకు ఇవ్వాలని రైతుల డిమాండ్ చేశారు. యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ యాచారం మండలానికి చెందిన ఫార్మా రైతులు

# యువ ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం



## ప్రభుత్వ పథకాలు, తెలంగాణ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లదే కీలక పాత్ర

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది.తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు,ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో, ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు.

# ఆశ్రయ్ కేంద్రాన్ని ప్రారంభించిన సైబరాబాద్ కమిషనర్ జి సృజన

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**జయేష్ రంజన్, ఐఏఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో కొండాపూర్‌లో నూతన ఆశ్రయ్ కేంద్రాన్ని ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్

తెలంగాణ ప్రభుత్వం,అమెజాన్ ఇండియా భాగస్వామ్యంలో కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన సరికొత్త ఆశ్రయ్ కేంద్రాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఐఏఎస్ గారు ఈరోజు ఘనంగా ప్రారంభించారు.ఈ ఏడాది ప్రారంభంలో తెలంగాణ ప్రభుత్వం, అమెజాన్ ఇండియా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం హైదరాబాద్ వ్యాప్తంగా ఈ ఆశ్రయ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



# గరంలో ఎఫ్‌పీటీఏ 65వ జాతీయ వార్షిక సదస్సు

**అక్టోబర్ 3 నుంచి 5 వరకు నోవాటెల్ హెచ్ఐసీసీలో...**

**వెయ్యి మందికి పైగా ప్రతినిధులు రాక**





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ (ఎఫ్‌పీటీఏ) 65వ వార్షిక సర్వసభ్య సమావేశం తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (టీపీఎంఏ)సహకారంతో హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీ వేదికగా అక్టోబర్ 3 నుంచి 5 వరకు జరగనుంది. ఈ వివరాలు తెలిపేందుకు బంజారా హిల్స్ లో ఉన్న తాజ్ డెక్కన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఎంఏ అధ్యక్షుడు అభిషేక్ విజయవర్గీయ, ప్రధాన కార్యదర్శి ఆశిష్ జైన్ భన్సాలీ,ఎఫ్‌పీటీఏ 65వ ఏజీఎం రిసెప్షన్ కమిటీ చైర్మన్ ప్రసాద్ ఆర్జీ, మీడియా ఒ పబ్లిసిటీ చైర్మన్ వినయ్ బల్వా,ఎఫ్‌పీటీఏ ప్రెసిడెంట్ నామినీ టీ కిషన్ సింగ్ మాట్లాడారు. 19 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నగరంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా పేపర్ వ్యాపారులు, తయారీదారులు,పారిశ్రామిక ప్రముఖులు పాల్గొననున్నారని చెప్పారు. అక్టోబర్ 3న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ మూడు రోజుల సదస్సులో దేశీయ పేపర్ పరిశ్రమ వృద్ధి, ఎంఎస్ఎంఈలకు వర్కింగ్ క్యాపిటల్ సదుపాయాలు,నోట్‌బుక్‌లపై జీఎస్టీ సరళీకరణ, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా రీసైకిల్డ్ పేపర్ వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై సమగ్ర కార్యాచరణను రూపొందించనున్నామని తెలిపారు. ఐటీసీ లిమిటెడ్ (పీఎస్‌పీడీ) సీఈఓ రాజేష్ పొన్నూరు ముఖ్య అతిథిగా, ఐపీఎంఏ అధ్యక్షుడు ఒ నైనీ పేపర్స్ లిమిటెడ్ సీఎండీ పవన్ అగర్వాల్,జేకే పేపర్ లిమిటెడ్ ప్రెసిడెంట్ ఒ డైరెక్టర్ ఏఎస్ మెహతా,ఇమామి పేపర్ మిల్స్ లిమిటెడ్ సీఈఓ ఒ హోల్‌టైమ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ ఖేతాన్ గౌరవ అతిథులుగా హాజరుకానున్నారన్నారు. ఈ సమావేశానికి ఎఫ్‌పీటీఏ అధ్యక్షుడు రాజేష్ జైన్ అధ్యక్షత వహిస్తారన్నారు. హైదరాబాద్‌కు చెందిన తిరుమల బాలాజీ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కిషన్ సింగ్ ఎఫ్‌పీటీఏ నామినీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించనుండటంతో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ సదస్సు పేపర్ వ్యాపారులు, తయారీదారులు,పారిశ్రామిక ప్రముఖులు,నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానుందన్నారు. ఇందులో సాంకేతిక సదస్సులు, పేపర్ రంగానికి సంబంధించిన తాజా పరిణామాలు,కొత్త అవకాశాలు,పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చలు జరగనున్నాయన్నారు. ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు,పెరుగుతున్న దిగుమతులు, వర్కింగ్ క్యాపిటల్ కొరత,పన్నుల సమస్యలు, కాగితం వినియోగాన్ని పెంచే మార్గాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారన్నారు. గౌర్ గోపాల్ దాస్ ఇచ్చే ప్రేరణాత్మక ఉపన్యాసంతో సహా పలు మోటివేషనల్ సెషన్లు కూడా ఈ సదస్సులో భాగం కానున్నాయన్నారు. నోట్‌బుక్‌లు,ఎక్సర్‌సైజ్ పుస్తకాలపై సున్నా శాతం జీఎస్టీని సరళతరం చేసి,సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతున్నామన్నారు. దీనివల్ల విద్యా సంబంధిత స్టేషనరీ ఉత్పత్తులు సామాన్యులకు మరింత అందుబాటులోకి రావడమే కాకుండా, పేపర్ వినియోగం కూడా పెరుగుతుందన్నారు. అర్హులైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) వ్యాపారులకు సులభమైన, తక్కువ వడ్డీకే వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందించాలని, బ్యాంక్ పరిమితుల పునరుద్ధరణను వేగవంతం చేయాలని, క్రెడిట్-గ్యారెంటీ పథకాలను మరింత అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పేపర్ వ్యాపారం అధిక నిల్వలతో కూడుకున్నదన్నారు. సరుకు నిల్వలను నిర్వహించడానికి, కొనుగోళ్లు, వినియోగదారుల నుంచి వచ్చే చెల్లింపుల మధ్య సమయ వ్యత్యాసాన్ని సర్దుబాటు చేయడానికి భారీ మూలధనం అవసరమవుతుందన్నారు. అందువల్ల వేలాది మంది వ్యాపారులు, ప్రత్యేకించి ఎంఎస్ఎంఈలు సజావుగా పని చేయడానికి, వ్యాపార వృద్ధి సాధించడానికి సులభతర ఆర్థిక సదుపాయాలు కీలకమన్నారు. ప్రపంచంలోని మూడవ అతిపెద్ద పేపర్ ఉత్పత్తి దేశాలలో భారతదేశం ఒకటన్నారు. దేశీయంగా వార్షిక ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 25 మిలియన్ టన్నులుగా ఉందన్నారు. ఈ పరిశ్రమ ఏటా సుమారు 5.8 నుంచి 6 శాతం వృద్ధిని నమోదు చేస్తూ దాదాపు రూ. 1,00,000 కోట్ల టర్నోవర్‌ను కలిగి ఉందన్నారు.

# పార్మాసిటీని రద్దు చేయాలి...

**మా భూములు మాకు ఇవ్వాలి: రైతులు**

**ఇబ్రహీంపట్నంలో ప్రజాభవన్ ముట్టడించిన ఫార్మా రైతులు..**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్..!**






**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి:** ఫార్మసిటిని రద్దుచేసి మా భూములను మాకు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ యాచారం మండలానికి చెందిన ఫార్మా రైతులు సోమవారం ప్రజాభవన్‌ను ముట్టడించారు. తమ భూముల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రైతులు స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములకు సంబంధించిన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేయడంతో పాటు తమ భూములను తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నంబర్ 31 అమలు చేయాలి..ఫార్మాసిటీకి సంబంధించి గతంలో ఇచ్చిన భూములపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు అనుగుణంగా జీవో నంబర్ 31ను అమలు చేసి, భూములను రైతులకు తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ..మూడేళ్లు గడిచినా పట్టించుకోలేదని ఆవేదన..ఎన్నికల సమయంలో తమ భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు సీతక్క, భట్టి విక్రమార్క, రాజు గోపాల్ గౌడ్, కోదండ రెడ్డి, తీన్మార్ మల్లన్నలు, మా వద్దకు వచ్చి తిరిగి భూములు ఇస్తామన్ని హామీ ఇచ్చారు. మూడేళ్లు గడుస్తున్నా తమ సమస్యపై తగిన స్థాయిలో స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. తమ భూముల కోసం ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్నామని, ఇకపై కూడా న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. తమ జీవనాధారమైన భూములను తిరిగి ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రజాభవన్ వద్ద ఉద్రిక్తత...రైతులు పెద్ద సంఖ్యలో ప్రజాభవన్ వద్దకు చేరుకుని తమ డిమాండ్లను వినిపించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఫార్మాసిటీ నిర్ణయంపై స్పష్టత ఇవ్వాలని రైతులు నినాదాలు చేశారు. రైతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

# యువతకు భగత్ సింగ్ ఆదర్శం

**బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి**

**చేవెళ్ల, సెప్టెంబర 28(ప్రజా జ్యోతి9:** దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన షహీద్ భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చేవెళ్ల బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా సోమవారం చేవెళ్లలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. దేశభక్తి, ధైర్యం, అంకితభావం, త్యాగానికి భగత్ సింగ్ జీవితం నిలువెత్తు నిదర్శనమని అన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, చూపిన తెగువ, చేసిన త్యాగం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మనీషా అనంతరెడ్డి, బీజేపీ నాయకులు పాగా వెంకటేష్, చాకలి శ్రీనివాస్, భార్గవ్‌రెడ్డి, తెలుగు శ్రీనివాస్, గణేష్, దామోదర్, శివ, హర్షిత్‌తో పాటు బీజేపీ కార్యకర్తలు, యువత, భగత్ సింగ్ అభిమానులు పాల్గొన్నారు.



# విస్తృతంగా ఈవీ ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు లక్ష్యంగా ముందుకు

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి) :** ఎలక్ట్రానిక్ వెహికల్స్(ఈవీ)లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఏథర్ సంస్థ ప్రతినిధులు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా గత జూన్ 30 నాటికి 218 ఏథర్ ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ స్కూటర్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఛార్జింగ్ సౌకర్యాలు దైనందిన జీవితంలో భాగం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటి వద్ద రాత్రిపూట ఛార్జింగ్, సుదూర ప్రయాణాలకు ఏథర్ గ్రిడ్ ఫాస్ట్ ఛార్జింగ్ నెట్‌వర్క్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా ఏథర్ గ్రిడ్ లో 6 వేలకు పైగా ఫాస్ట్ ఛార్జర్లు, ఓపెన్-సోర్స్ ఎల్ఈసీసీఎస్ ఛార్జర్లతో సహా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫాస్ట్ ఛార్జర్ 10 నిమిషాల్లో సుమారు 30 కి.మీ. ప్రయాణానికి సరిపడే శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. కేఫ్‌లు, కార్యాలయాలు, మాల్స్ వంటి ప్రజలు సందర్శించే ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు, షేర్డ్ ఛార్జింగ్ ప్రమాణాలు, అపార్ట్‌మెంట్లలో సులభమైన ఛార్జర్ ఇన్‌స్టాలేషన్ ద్వారా ఈవీ యాజమాన్యాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

# భూవివాదంలో ఇద్దరిపై దాడి: నలుగురు నిందితులు రిమాండ్




**షాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రజాజ్యోతి ):** షాబాద్ గ్రామ శివారులో తేదీ 25.09.2026 నాడు రాత్రి 08:00 గంటల సమయంలో భూవివాద నేపథ్యంలో వెంకటేశ్ మరియు చిన్న రాములు పై గొడ్డలి, కర్రలు మరియు రాయితో నిందితులు దాడి చేసినట్లు కేసు నమోదైంది. ఈ దాడిలో వెంకటేశ్ ఎడమ అరచేతికి లోతైన గాయం కాగా, చిన్న రాములు ఎడమ కంటి సమీపంలో గాయంతో పాటు శరీరంపై ఇతర గాయాలు ఏర్పడ్డాయి. భూవివాదం కారణంగా నిందితులు నర్సింలు, పెద్ద రాములు, అభిషేక్ మరియు అఖిల్ లు దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇట్టి కేసులో షాబాద్ పోలీస్ వారు నిందితులను అరెస్టు చేసి 28.09.2026 నాడు చేవెళ్ళ న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

# “సర్” ప్రక్రియలో అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా భారీ నిరసన ర్యాలీ

**ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**





**ఉప్పల్,సెప్టెంబర్ 20, (ప్రజాజ్యోతి) :** సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణి కి వ్యతిరేకంగా నెక్లెస్ రోడ్ లోని ఇందిరాగాంధీ విగ్రహం నుండి బషీర్ బాగ్ లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజవర్గం,డివిజన్ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు.

# నాచారం--హెచ్ఎంటీ నగర్ అభివృద్ధి పనులపై ఉప్పల్ జోన్ ఎస్ ఈ రమేష్ బాబుతో చర్చ



**ఉప్పల్,సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి):** నాచారం-హెచ్ఎంటీ నగర్ డివిజన్లలో కొనసాగుతున్న, చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఉప్పల్ జోన్ ఎస్ ఈ రమేష్ బాబు తో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధానంగా నాచారం రైతు బజార్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులకు సంబంధించి ఇప్పటివరకు టెండర్ ఎందుకు పూర్తికాలేదని సాయిజెన్ శేఖర్ ప్రశ్నించారు. దీనిపై ఎస్ ఈ రమేష్ బాబు స్పందిస్తూ టెక్నికల్ సమస్య కారణం గా టెండర్ ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగిందని, ప్రస్తుతం ఈ ప్రతిపాదన ను కమిషనర్‌కు పంపించామని, త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే ఎర్రగుంట హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి ?3 కోట్ల నిధులు మంజూరైన, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయినందున, ఇక ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని సాయిజెన్ శేఖర్ అధికారులను కోరారు. అలాగే ఇప్పటికే మంజూరైన ఇందిరానగర్ రోడ్లు బాపూజీ నగర్ రోడ్లు సరస్వతీ నగర్ మెయిన్ రోడ్లు మిగిలిన భవాని నగర్ రోడ్లు గాంధీనగర్ రోడ్లు కొండిన్య నగర్ రోడ్లు శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్లు హనుమాన్ నగర్ రోడ్లు దుర్గా నగర్ రోడ్లు రామ్ రెడ్డి నగర్ రోడ్లు తదితర మంజూరైన రోడ్ల తక్షణమేప్రారంభించాలని కోరడం జరిగింది.

# అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సీఎంసి కమిషనర్ సృజన ఐఏఎస్ కి ఫిర్యాదు

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మిద్దెల మల్లారెడ్డి**



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** సీఎంసి కమిషనర్ ఆఫీస్ లో సీఎంసి కమిషనర్ సృజన మేడం ని కలిసి మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో విపరీతమైన అక్రమ కట్టడాల పైన ఫిర్యాదు చేసిన మిద్దెల మల్లారెడ్డి సీఎంసి కమిషనర్ కి గజ్ బోల్తా 50 గజాలు 100 గజాల ఇల్లులను నిర్లక్ష్యంగా కులుస్తున్నారు వారందరూ పొట్ట చేత పట్టుకొని నగరానికి పనుల చేసుకొని బతుకుదామని వలస వచ్చిన దీనస్థితిలో ఉన్న గరీబ్ వాళ్ళు అలాంటి వారి ఇల్లులను నిర్లక్ష్యంగా కులుస్తూ అయ్యప్ప సొసైటీ లో ఎలాంటి అనుమతులు లేకుండా దాదాపు 500,1000,2000,3000, 4000, గజాలలో 10 నుంచి 11 అంతస్తుల ఎత్తులో అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్న బడా బాబుల జోలికి వెళ్లడం లేదు కారణం ప్రజలకు తెలుపాల్సిన అవసరం సీఎంసి కమిషనర్ కి ఉంది అని మిద్దెల మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎందుకు అయ్యప్ప సొసైటీని పట్టించుకోవడంలేదని ఈ సందర్భంగా ఆయన పత్రిక విలేకరులకు తెలియపరిచారు కావున వెంటనే కిందిస్థాయి అధికారులను పురమాయించి అయ్యప్ప సొసైటీలోని అక్రమ కట్టడాలను పరిశీలించి వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్న మిద్దెల ఎందుకంటే అభం శుభం తెలియని అమాయకులు ఇలాంటి బడా బిల్డర్ ల మాయలో పడి అపార్ట్మెంట్లోని ఫ్లాట్లను కొనుక్కుంటున్నారు కొనుక్కున్న తర్వాత హైడ్రా కమిషనర్, సీఎంసి కమిషనర్ వచ్చి ఇట్టి అక్రమ కట్టడాలను కులుస్తున్నారు అప్పుడు నష్టపోయేది అమాయక ప్రజలు మీరు నిర్మాణ దశలోనే ఇట్టి అక్రమ నిర్మాణాలను ఆపినచో అమాయక ప్రజలు మోసపోరు కావున వెంటనే ఇట్టి అక్రమ నిర్మాణాలను నిలిపివేసి నిర్మాణదారుల పైన క్రిమినల్ కేసులు పెట్టి ఇట్టి అక్రమ నిర్మాణాలను నిలిపి వేసే క్రమంలో అధికారులు విఫలమైనారు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, ఏసిపి హబీబ్ నిషా వీరి పైన వెంటనే చర్య తీసుకుని ప్రజలకు

# ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

## ఉప్పల్ ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు




**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి :** ఉప్పల్ ప్రభుత్వ కళాశాల లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి, మధుర శ్రీనాథ పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు కవుల పరిచయాలు, వారి సాహిత్య కృషి, సామాజిక చైతన్యంపై అవగాహన పెంపొందించేం దుకు క్విజ్ పోటీ నిర్వహించ బడింది.క్విజ్ పోటీని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డా. కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ జాషువా మానవవిలువలతోకూడిన సాహిత్యంతో దళిత సాహిత్యము లో విశేష కృషి చేసి ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్. సత్యనారాయణ మాట్లాడుతూ గబ్బిలం, స్వప్నకథ,పిరదౌసి,బాపూజీ, నేతాజీ, కొత్తలోకం, క్రీస్తు చరిత్ర, ముసాఫరులు, నాగార్జునసాగర్ వంటి అనేక ఖండకావ్యాలు రచించి వివక్షత,అణచివేతలను నిరసించి సుకవిగా ప్రజల నాల్కలపై నిలిచారని పేర్కొన్నారు.భాషాసాహిత్య విభాగం సమన్వయకర్త తెలుగు అధ్యాపకులు జల్దావిశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ జాషువా ఆనాటికీ ఈనాటికీ సాటిలేని మహాకవని,ఆయన కవిత్వం చెక్కుచెదరని, మొక్కవోని చక్కదనం సంతరించు కున్నదని తెలిపారు ఆయన తెలుగు పద్యానికి ఒక హృద్యమైన శైలి సంతరించారని పేర్కొన్నారు. ఆయన వాణి నిత్య కళ్యాణి ఆయన బాణి అనన్య సామాన్యమైనది, ఆయన లేఖిని అమృతవాహిని అని వ్యాఖ్యానించారు.ఆయన ప్రసిద్ధ పద్యాలు కొన్ని అద్భుతంగా పాడి వినిపించారు.గుర్రం జాషువా జీవితం, సాహిత్యం, కృషిపై విద్యార్థులు పిపిటి ప్రదర్శన చేశారు. జాషువా సాహిత్య ప్రత్యేకతల పై సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాగిన ఆయన రచనలపై విద్యార్థులు అవగాహన పొందారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు జాషువా కవిత్వంలోని సామాజిక స్ఫూర్తి, తెలుగు సాహిత్యం లోని వైభవం గురించి తెలుసుకున్నారు.ఈ పోటీ విద్యార్థుల్లో సాహిత్యాభి మానం, సామాజిక చైతన్యం పెంపొందించ డంలో విజయవంతమైంది.



# అడ్డదారిలో ఇచ్చిన ఎల్ఆర్ఎస్ ను రద్దు చేయాలి కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** డిఫెన్స్ కాలనీకి చెందిన పార్కు స్థలం, స. నెంబర్ 267 చందానగర్ లోని పార్కు స్థలాన్ని స. నెం. 125 లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ తో కబ్జా చేయడాన్ని, అడ్డదారిలో ఇచ్చిన ఎల్ ఆర్ ఎస్ ను రద్దు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ నారాయణ్ అమిత్ కు డిఫెన్స్ కాలనీ అసోసియేషన్ తో కలిసి ఫిర్యాదు చేసిన 'జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి. ఈ సందర్భంగా గతంలో డిప్యూటీ కమీషనర్ పేషీ చందానగర్ లో మూడు ప్రజావాణి లలో,జోనల్ కమీషనర్ పేషీ ప్రజావాణిలో రెండు సార్లు కాలనీ అసోసియేషన్ ఫిర్యాదు చేయడం జరిగిందని,జనం కోసం కూడా గత జోనల్ కమీషనర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిందని,కమీషనర్లు మారుతున్నారు కానీ... సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని వెంటనే చేసిన తప్పును సరిచేసి పార్కును కాపాడాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి జోనల్ కనీషనర్ ను కోరారు.ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ మాటాడుతూ...చెరువులు, పార్కుల్లో ఇచ్చిన అనుమతులను కానీ...ఎల్ఆర్ఎస్ లను కానీ...వెంటనే రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కసిరెడ్డి భాస్కరరెడ్డి తో పాటు జోనల్ కమీషనర్ ను కలిసిన వారిలో ప్రసాదరాజు,విఠల్, అడివయ్య,బాలలక్ష్మయ్య ఉన్నారు.

# మూసీనది పరిరక్షణతోనే హైదరాబాద్ భవిష్యత్తు

## ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్



**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి) :** మూసీ నది, సహజ ప్రవాహ మార్గాలు, చెరువులను పరిరక్షించడంతోనే హైదరాబాద్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్(ఎఫ్.బి.హెచ్) చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్ అన్నారు. 1908 మూసీ వరదల బాధితులకు నివాళులర్పిస్తూ సోమవారం ఉస్మానియా జనరల్ ఆసుపత్రి(ఓజీహెచ్) ప్రాంగణంలోని చారిత్రక చింతచెట్టు వద్ద ఎఫ్.బి.హెచ్ ఆధ్వర్యంలో స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఐ విట్నెస్ అకౌంట్స్ ఆన్ రివర్ మూసి ఫ్లడ్స్ ఆఫ్ 1908' పుస్తకాన్ని వేదకుమార్, పరాశర్ ఆవిష్కరించారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని డా.ద్యావనపల్లి సత్యనారాయణ రచించారు. 1908 వరదలపై పరాశర్ లావణి ప్రదర్శించగా, చారిత్రక కథనాలను యువతకు ఫొటోలు, మ్యాపులు, యానిమేషన్ల ద్వారా పరిచయం చేయాలని వేదకుమార్ సూచించారు. ఎఫ్.బి.హెచ్ జనరల్ సెక్రటరీ శోభా సింగ్, సభ్యుడు ఆదర్శ్, కోఆర్డినేటర్ సయ్యద్ ఖైసర్, హరికిషన్, వేణుగోపాల్, ఆర్కిటెక్ట్ రామ్ రాజ్, జెబిఆర్ ఆర్కిటెక్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ అధ్యాపకులు సోనూ కుమార్, ప్రత్యూష, సిరీష, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# సర్ అక్రమాలపై వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

## ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం.. ఎన్నికల సంఘం తీరుపై నిరసన






ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి :సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నా యంటూ నిరసనగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.
మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్దనున్న వైయస్సార్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత అని అన్నారు. సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అభ్యంత రాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలని కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల రక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని వజ్రేష్ యాదవ్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు,నక్క ప్రభాకర్ గౌడ్ మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ రుద్దీన్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరసింహులు యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,బాలురెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణ,డీసీసీ జనరల్ సెక్రటరీ బీపీటీ రాజు ఏనుగు జలెందర్ రెడ్డి, అంజిరెడ్డి ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవితో పాటు డివిజన్ ఉపాధ్యక్షులు యాసారం మహేష్, పాశం రాజు, కాటపాక కుమార్, మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు బోడిగే కృష్ణ గౌడ్, సుభాష్ నాయక్, సుదర్శన్ రెడ్డి, సుక్క జయందర్, సెక్రటరీ బొల్లుగిరి నాగరాజు, అధికార ప్రతినిధి వెంకటేష్ గౌడ్, కార్యనిర్వాహక సభ్యుడు మహేశ్వరప్ప, కర్రె బలరాం,నాగరాజు,భరత్, విక్కీ, సంపత్, మహిళా అధ్యక్షురాలు ఎన్ ఎన్ కే దుర్గా మరియు తదితరులు పాల్గొన్నారు.

# టిష్యూ కల్చర్ అరటికి రూ.28 వేల రాయితీ

## జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంఏ సత్తార్





**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 0(ప్రజా జ్యోతి):** జిల్లాలో టిష్యూ కల్చర్ అరటి సాగును ప్రోత్సహించేందుకు సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎం ఐ డి హెచ్) కింద రైతులకు రెండేళ్ల పాటు రాయితీ అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఎ. సత్తార్ తెలిపారు. మొదటి ఏడాది ఎకరాకు రూ.16,800, రెండో ఏడాది రూ.11,200 చొప్పున మొత్తం రెండేళ్లకు ఎకరాకు రూ.28 వేల రాయితీ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. టిష్యూ కల్చర్ మొక్కలను వినియోగించడం వల్ల తోటలో మొక్కల పెరుగుదల ఏకరీతిగా ఉండటంతో పాటు నాణ్యమైన పండ్లు, మంచి గెలలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యకరమైన మొక్కలను నాటడం ద్వారా కొన్ని వ్యాధుల వ్యాప్తి ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చన్నారు. పంట కోత ఒకే సమయంలో వచ్చే అవకాశం ఉండటంతో మార్కెటింగ్ సులభతరం అవుతుందని వివరించారు. అరటి సాగుకు మంచి నీటి పారుదల కలిగిన నేలను ఎంపిక చేసుకుని, నేల పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. నాణ్యమైన టిష్యూ కల్చర్ మొక్కలను ఎంపిక చేసి సిఫార్సు చేసిన దూరంలో నాటడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించాలని తెలిపారు. కలుపు నివారణ, పిలకల తొలగింపు, మట్టి ఎగదీత, సమగ్ర సస్యరక్షణ చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. అరటి గెలలు ఏర్పడిన తర్వాత కవరింగ్ వంటి పద్ధతులతో నాణ్యతను కాపాడుకోవాలని, సరైన పరిపక్వత దశలో పంటను కోత కోసి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విక్రయించాలన్నారు. జిల్లాలో అరటి సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఈ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని ఎం.ఎ. సత్తార్ కోరారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక.. భగత్ సింగ్

## యువత ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలి

## మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి



**చేవెళ్ల, సెప్టెంబరు 28(ప్రజా జ్యోతి):** దేశభక్తికి నిలువెత్తు రూపం.. పోరాట స్ఫూర్తికి ప్రతీక.. త్యాగానికి అసలైన నిర్వచనం షహీద్ భగత్ సింగ్ అని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా సోమవారం చేవెళ్లలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. భారతమాత విముక్తి కోసం భగత్ సింగ్ తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆయన ధైర్యం, దేశభక్తి, త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. యువత భగత్ సింగ్ దేశభక్తి, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో 17 వ వార్డు కౌన్సిలర్ కృష్ణ నాయక్, కౌన్సిలర్లు మంగలి కళ్యాణి యాదగిరి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు ఫరీన్ ఖదీర్ పాషా, మహమ్మద్ చాన్ పాషా, నాయకులు సంగమేశ్వర్, వడ్ల శ్రీనివాస్ చారి, రామకృష్ణ, రవి, సతీష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ సోదాల వివరాలు వెల్లడించాలి: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల డిమాండ్





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసం, కార్యాలయాలతో పాటు సంబంధిత ప్రాంతాల్లో 2024 సెప్టెంబర్ 27, 28 తేదీల్లో ఈడీ నిర్వహించిన సోదాలు, అనంతరం కొనసాగిన దర్యాప్తు వివరాలను వెల్లడించాలని కోరుతూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్ గౌడ్, సంజయ్ పార్టీ సీనియర్ నాయకులు తలసాని సాయి,బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈడీ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఈడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయగా, అనంతరం అధికారులను కలిసి లేఖ అందించేందుకు పోలీసులు అనుమతించారు.ఈడి డిప్యూటీ డైరెక్టర్ స్వాతి ని కలిసి లేఖను అందించారు... రెండేళ్లుగా దర్యాప్తు ఏ దశలో ఉంది?2024 సెప్టెంబర్ 27, 28 తేదీల్లో జరిగిన ఈడీ సోదాలకు రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ఇప్పటివరకు దర్యాప్తు ఏ దశలో ఉందో స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ తన లేఖలో కోరింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదు, పత్రాలు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వెల్లడించాలని కోరింది.ఈడీ సోదాలు సుమారు 16 ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగాయని, పెద్ద సంఖ్యలో అధికారులు, సి ఆర్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారని లేఖలో పేర్కొన్నారు. సోదాల సందర్భంగా నగదు లెక్కింపు యంత్రాలను కూడా తీసుకెళ్లినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. అయితే సోదాల అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులు, తదుపరి దర్యాప్తు చర్యలపై స్పష్టమైన సమాచారం వెల్లడించలేదని ప్రశ్నించింది. పలు కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రశ్నలు.నరసాపూర్ కోదండల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, వాటింగపల్లి ఎఫ్ ఐ ఆర్ , కొత్వాల్‌గూడ--మనసా హిల్స్‌కు సంబంధించిన అంశాలను కూడా లేఖలో ప్రస్తావిస్తూ, ఆయా వ్యవహారాల్లో దర్యాప్తు పురోగతి ఏమిటో వెల్లడించాలని బీఆర్ఎస్ కోరింది. ఈడీకి బీఆర్ఎస్ అడిగిన ప్రధాన ప్రశ్నలు 2024 సెప్టెంబర్ 27, 28 తేదీల సోదాలకు సంబంధించిన ఈ సి ఐ ఆర్ /కేసు వివరాలు ఏమిటి?సోదాల్లో ఎంత నగదు, ఎలాంటి పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు?స్వాధీనం చేసుకున్న వస్తువులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి?సంబధిత వ్యక్తులకు నోటీసులు లేదా సమన్లు జారీ చేశారా?దర్యాప్తు అనంతరం ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు చేశారా?సీజ్ చేసిన ఆస్తులు, వాచ్‌లు తదితరాల ప్రస్తుత స్థితి ఏమిటి?దర్యాప్తు ప్రస్తుత స్థితి ఏమిటి? తదుపరి చర్యలు ఏమిటి?ఈ వివరాలను 15 రోజుల్లోగా వెల్లడించాలని బీఆర్ఎస్ ఈడీని కోరింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లయితే, తదుపరి చర్యలకు సంబంధించిన కాలపరిమితిపై కూడా స్పష్టత ఇవ్వాలని లేఖలో కోరింది.చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్నదే తమ అభిప్రాయమని, ప్రజలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

# 25 సంవత్సరాల మోడీ సేవ,

## సంకల్ప అభియాన్ చిత్రలేఖన పోటీలు

## విజ్ఞాన జ్యోతి గ్రామర్ హై స్కూల్ లో ప్రత్యేక కార్యక్రమం



ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి : భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ 25 సంవత్సరాల అంకిత భావంతో కూడిన ప్రజాసేవ పురస్కరించుకొని, 25 సంవత్సరాల సేవా సమర్పణ, అభివృద్ధి చెందిన భారతదేశం లో వివిధ రంగాలలో సాధించిన అభ్యున్నతి సాధించిన విజయాలు25 కోట్ల కల సేవా స్వప్నం లో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి (అర్బన్ )జిల్లా పరిధిలోని పాఠశాల స్థాయి విద్యార్థుల చిత్రలేఖనం పోటీలను, రామంతపూర్ లోని, వెంకటరెడ్డి నగర్ డివిజన్ లో గల విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప అభియాన్ ఉప్పల్ నియోజకవర్గం కన్వీనర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొరిగే కృష్ణ,పోగ్రామ్ కోఆర్డినేటర్స్ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, వేములకొండ సోమశేఖర్, స్కూల్ ప్రిన్సిపల్ వేములకొండ రేణుక,స్కూల్ కోఆర్డినేటర్ నవనీత,ఉపాధ్యాయులు రాణి,అంబిక, కృష్ణవేణి, మమత మౌనిక, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువత భగత్ సింగ్ లా ధైర్యంగా పోరాడాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు**

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )**స్వతంత్ర సమరయోధుడు విప్లవం యువకిశోరం 119వ జయంతి సందర్భంగా నేడు అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట మరియు ముక్దుం నగర్ లోని భగత్ సింగ్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని క్షమాభిక్ష అడిగితే భగత్ సింగ్ ఉరి శిక్ష రద్దయ్యేదని కానీ దేశం స్వాతంత్రం కంటే తన ప్రాణం ముఖ్యమైనది కాదని భావించి కొడతాడు ఈ దేశ స్వతంత్రం కోసం తన ప్రాణాలు నడిపించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువకులకు స్ఫూర్తిగా నిలిచారని అలాంటి భగత్ సింగ్ కళలు కన్నట్లుగా భారతదేశం నేడు లేదని కావున భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శాలను నేటి యువత తెలుసుకొని ఈ దేశంలో సమసమాజ నిర్మాణం కోసం అసమానతలు లేని భారతదేశ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు కొంతమంది క్షమాభిక్ష అడిగిన వాళ్ళను పొగుడుతున్నారని అలాంటివారు ఎలా స్వతంత్ర సమరయోధులు అవుతారని వాళ్ళ వారసులుగా చెప్పుకునే వాళ్ళు కూడా క్షమాభిక్ష కోరిన వారిని తమ నాయకుడిగా పీల్చుకోవడం సిగ్గుచేటని అన్నారు. అదేవిధంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం మరియు సిపిఐ మండల కార్యదర్శి కే స్వామిలు మాట్లాడుతూ యువత నిరాశ చెందకుండా ఢిల్లీలో జరిగిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కట్టితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని కావున యువత మత్తుకు బానిస కాకుండా, మత విద్వేష రాజకీయాలకు గురికాకుండా మంచి రాజకీయాలు చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ మరియు కీర్తి నాయకత్వం వహించగా, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ఏఐటీయుసీ కార్యదర్శి శ్రీనివాస్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాములు ప్రజానాట్యమండలి అధ్యక్షులు



బాబు మాజీ కార్యదర్శి వెంకటేష్ శాఖా కార్యదర్శులు సహదేవరెడ్డి, నరసయ్య ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, విజయ్, మహేందర్, శ్రీనివాస్ సిపిఐ నాయకులు ఇమామ్, చారి, తెలంగాణ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# బోరు వేయాలంటే.. ఇంకుడు గుంత తప్పనిసరి

**ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఉంటేనే బోరుకు అనుమతి ఇవ్వాలి**

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )** నగర పరిధిలో విచ్చలవిడిగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయని పర్యావరణ, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భైరెడ్డి రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణ సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని తన ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసిన తర్వాతే బోరు వేయడానికి అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బోరు యజమానులకు రెవెన్యూ, వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోటీసులు జారీ చేసి, భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత బోరు యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొత్త లేఅవుట్లు, హెచ్ఎండీఏ, డీపీ లేఅవుట్లలో కూడా వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇంకుడు గుంత ఉంటేనే రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలకు అర్హత కల్పించేలా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. ఇంట్లో లేదా ప్లాట్‌లో ఇంకుడు గుంత లేకపోతే బోరు వేయడానికి బోరు యజమానులు కూడా అనుమతించకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించకుండా వృథా చేస్తే భవిష్యత్ తరాలకు తాగునీటి కొరత మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఇప్పుడే నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించకపోతే రానున్న రోజుల్లో వేల అడుగుల లోతుకు వెళ్లినా నీటి జాడ దొరకని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చినా, అధిక ధరలు చెల్లించినప్పటికీ నీరు అందుబాటులో ఉండకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు ఉన్నప్పుడే దాని విలువ తెలియకపోతే.. నీరు లేని రోజుల్లో ఎంత డబ్బు పెట్టినా



దొరకదని రక్తం దొరికే పరిస్థితి ఉండొచ్చు.. కానీ నీరు దొరకని దుస్థితి రాకుండా ఇప్పుడే మేల్కొనాలని వారు అన్నారు. భూగర్భ జలాల పరిరక్షణను అధికారులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, అక్రమ బోర్లపై నిఘా పెంచడంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఐపీ మల్లేష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాహిద్ భగత్‌సింగ్ కలల భారతం ఓటుహక్కు పరిరక్షణే మనం బాధ్యత

**సర్ ప్రక్రియలో తప్పిదాలపై సమగ్ర విచారణ జరపాలి, జ్ఞానేశ్ కుమార్‌ను రాజీనామా, అరెస్ట్ చేయాలని డిమాండ్**

**ఏఐటీయూవ్, సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి**

**ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్.**



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )** భగత్‌సింగ్ కోరుకున్న స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుంచి అధికార బదిలీ కాదని, దోపిడీ, అసమానతలకు ముగింపు పలికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక, ప్రజాస్వామ్య న్యాయంపై ఆధారపడిన సమాజ నిర్మాణం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారని, ఆ సమాజం కోసం నేటి యువత, విద్యార్థులు పాటుపడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భారతదేశస్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా ఏఐటీయూసీ నిజాంపేట్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, ఓటుహక్కు పరిరక్షణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తప్పిదాలపై సమగ్ర విచారణ జరపి ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, అరెస్ట్ చేయాలని డిమాండ్, ప్రగతి నగర్ పీకాక్, సర్కిల్ వద్ద నినాదాలు చేస్తూ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఓటుహక్కు పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ భగత్‌సింగ్ నాడు దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం చేస్తే... నేడు అదే ప్రజాస్వామ్య వ్యవస్థకు , రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గుప్తా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య హక్కులలో కీలకమైన భాగమని, అందువల్ల సర్ ప్రక్రియలో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా పూర్తి పారదర్శకత ఉండాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. సర్ లో నమోదైన తప్పిదాలు, నోటీసుల ప్రక్రియ, ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఎన్నికల సంఘం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా జ్ఞానేశ్ కుమార్ గుప్తా నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఈ అంశాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని, బాధ్యతారాహిత్యం లేదా చట్టవిరుద్ధ చర్యలు ఏవైనా విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అందుకే ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను రాజీనామా చేయాలని, ఆలాగే అరెస్ట్ చేయాలని ప్రజాస్వామ్య వాదులుగా కోరుతున్నామన్నారు జ్ఞానేష్ ను తక్షణమే పదవి నుండి తొలగించాలని లేకుంటే దేశవ్యాప్తంగా ప్రజలు కార్మికులు యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శి మేకల బాల కృష్ణ, ఆశి. యాదయ్య, కన్వీనర్ పొన్నకంటి. దస్తగిరి, నర్సింహా, సురేష్, రాజు,కె. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వివక్షత, అంటరానితనం లేని సమరసత సమాజాన్ని నిర్మించాలి

**కుల అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలి: ఈశ్వరయ్య**

**మొయినాబాద్‌లో సామాజిక సమరసత నూతన కమిటీ ఏర్పాటు**

**మొయినాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** వివక్షత, అంటరానితనం లేని సమరసత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సమరసత జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. మొయినాబాద్ శివాలయంలో సామాజిక సమరసత మొయినాబాద్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మంలో అస్పృశ్యతకు స్థానం లేదని, కాలక్రమేణా సమాజంలోకి వచ్చిన దురాచారాలు సమాజానికి మాయని మచ్చలుగా మిగిలాయని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని అన్ని కులాల్లో జన్మించిన మహానుభావులు చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని, నేటి తరం కుల అసమానతలను తొలగించేందుకు ముందుకు రావాలని కోరారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ కులాల మధ్య చిచ్చుపెట్టే శక్తుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సమావేశంలో భాగంగా మొయినాబాద్ మండలానికి సామాజిక సమరసత నూతన కమిటీని



ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పడమటి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా కుమ్మరి రామచందర్ (గురుస్వామి), ప్రధాన కార్యదర్శిగా వడ్ల కృష్ణను నియమించారు. ఉపాధ్యక్షులుగా జంబుల బాలరాజు, విద్యార్థి విభాగానికి అభిరామ్, ప్రచార ప్రముఖ్‌గా వడ్ల రవీందర్ చారి, ధర్మాచరణ విభాగానికి ద్యాపా పాండు, కళా విభాగానికి భానురి సంఘమేష్, జననేత విభాగానికి సుధాకర్‌రెడ్డి, పర్యావరణ విభాగానికి బద్దం ప్రతాపరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో జంగయ్య, ప్రశాంత్, కవ్వగూడెం శ్రీను తదితరులు పాల్గొన్నారు,

# పాండెనవాగు ఎస్ఎన్ డిపి పనులను పరిశీలించిన సీఎంసీ కమిషనర్





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ పాండెనవాగు పరిధిలో కొనసాగుతున్న ఎస్ ఎన్ డి పి పనులను ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్, చీఫ్ ఇంజనీర్,ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని వివిధ ప్రాంతాల్లో పనుల పురోగతి, క్షేత్రస్థాయి పరిస్థితులు మరియు అవసరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా నాలా అలైన్‌మెంట్ మరియు వెడల్పుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. నాలా మార్గం,వెడల్పులో ఉన్న క్షేత్రస్థాయి సమస్యలతో పాటు, ప్రతిపాదిత పనులకు అవసరమైన ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు అంశాన్ని కూడా సమీక్షించారు. మారిచెట్టు జంక్షన్ వద్ద బల్కాపూర్ నాలాపై ఉన్న ఆక్రమణలను పరిశీలించడంతో పాటు, మారిచెట్టు నుంచి పంచవటి కాలనీ వరకు రోడ్డు విస్తరణ ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన క్షేత్రస్థాయి అంశాలను పరిశీలించారు. అదేవిధంగా విజేత సూపర్‌మార్కెట్ నుంచి చిత్రపురి మోడల్ రోడ్డు వరకు నాలా వెంబడి ప్రతిపాదించిన స్లిప్ రోడ్ను పరిశీలించారు. ఈ మార్గాన్ని రోడ్-కమ్-బాక్స్ డ్రెయిన్గా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచవటి కాలనీ వద్ద షేక్‌పేట్ నాలా డైవర్షన్ పాయింట్‌ను కూడా కమిషనర్ పరిశీలించి,అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. తదుపరి చర్యలకు సంబంధించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని, క్షేత్రస్థాయి అవసరాలను పరిష్కరించి,అవసరమైన పనులను వీలైనంత త్వరగా చేపట్టి ఎస్ ఎన్ డి పి పనుల్లో సకాలంలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# ఘనంగా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

**అంగన్వాడీ కేంద్రంలో పండ్లు బిస్కెట్లను పంపిణీ చేసిన పోత గౌని గోపాల్ గౌడ్**



**ఉప్పల్,సెప్టెంబర్28, ప్రజా జ్యోతి:** శ్రీ నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా హెచ్ఎంటి నగర్ డివిజన్‌లో అంగన్వాడీ కేంద్రాల సందర్శన, పండ్లు- బిస్కట్ల పంపిణీ?దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించు కొని, జాతీయ పార్టీ ఆధ్వర్యం లో చేపట్టిన 'సంకల్ప్ అభియాన్' కార్యక్రమం లో భాగంగా ఈరోజు మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్ఎంటి నగర్ డివిజన్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఘనంగా సందర్శించారు.?ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారు లతో కాసేపు ముచ్చటించి, వారికి ఆత్మీయంగా పండ్లు బిస్కట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారుల బాగోగులు చూస్తున్న అంగన్వాడీ టీచర్లు ఆయాలను శాలువాలతో ఘనంగా సత్కరించి, సమాజానికి వారు అందిస్తున్న అమూల్యమైన సేవలను కొనియాడారు. కార్యక్రమం లో నాయకులు యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎండీ అన్వర్, వేణుగోపాల్, శేఖర్ గుప్తా, క్రాంతికుమార్,మంజుల వాణి, పార్వతి తదితర ప్రముఖులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లక్షలాది వినియోగదారులకు ఫ్లాగ్‌షిప్ ఆవిష్కరణ




పండుగ సీజన్‌కు ముందు, ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ ఈరోజు పల్స్ 2 ఎఫ్ఈ, నోవాటాబ్ మరియు లాప్ టాబ్ లను విడుదల చేయడం ద్వారా తన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. కమ్యూనికేషన్, అభ్యాసం, వినోదం మరియు ఉత్పాదకతకు సంబంధించిన మూడు కొత్త సాంకేతిక అనుభవాలను వినియోగదారులకు అందిస్తోంది. భారతదేశవ్యాప్తంగా వినియోగదారులు సాంకేతిక ఉత్పత్తుల కొనుగోలు, అప్‌గ్రేడ్‌లు మరియు బహుమతుల కోసం సంవత్సరంలోని ముఖ్యమైన కాలాల్లో ఒకదానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ విడుదల జరిగింది. ప్రతి ఉత్పత్తి ఒక ప్రత్యేక వినియోగదారుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. "ఫస్ట్ స్టెప్ టు ఏ స్మార్టర్ వరల్డ్"గా స్థాపించబడిన పల్స్ 2 ఎఫ్ఈ, తమ డిజిటల్ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న లేదా అప్‌గ్రేడ్ చేస్తున్న వినియోగదారులకు అవసరమైన స్మార్ట్‌ఫోన్ అనుభవాలను అందిస్తుంది. నోవాటాబ్ మరియు లాప్టాబ్లతో ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ 5జీ టాబ్లెట్ విభాగంలోకి ప్రవేశించడంతో పాటు, తన కనెక్టెడ్ ఎకోసిస్టమ్ వ్యూహంలో తదుపరి దశను కూడా ప్రారంభిస్తోంది. నోవాటాబ్ పెద్ద స్క్రీన్‌కు 5జీ కనెక్టివిటీని అందిస్తూ, విద్య మరియు అభ్యాసంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

# సకాలంలో రుణాలు చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయితీ

**పిఎసిఎస్ చైర్మన్ యానం శ్రీధర్ రెడ్డి**



**కేశంపేట సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను చెల్లించాలని పిఎస్సిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి కోరారు మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో పిఎసిఎస్ కార్యాలయంలో శ్రీధర్ రెడ్డి అధ్యక్షతనలో పాలకమండలి సభ్యులు మహాజన సభ నిర్వహించారు ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ఎక్కువ రుణాలను పొందాలని ఆయన అన్నారు రుణాలను సకాలంలో చెల్లించిన వారికి మూడు శాతం వడ్డీ రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు రైతులకు సకాలంలో ఎరువులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదాం అవసరం ఉందని దాన్ని ఎమ్మెల్యే గారితో చర్చించి త్వరలోనే వచ్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సీఈవో అనిల్ డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు

# అవినీతి తిమింగలాలైన పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

**యాలాల్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** అవినీతి తిమింగలాలుగా మారి గ్రామపంచాయతీ నిధులను స్వలాభం కొరకు దుర్వినియోగం చేసిన ఉపసర్పంచ్ దీ రామప్ప, పంచాయతీ సెక్రెటరీ శేఖర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చెల్క స్వరూప డిమాండ్ చేశారు. సోమవారం యాలాల మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామపంచాయతీ నిధులను ఉపసర్పంచ్ దీ రామప్ప, పంచాయతీ సెక్రెటరీ శేఖర్ లు ఇష్టానుసారంగా వాడుకొని తనను వేధింపులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చెల్క స్వరూప మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనిజకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామపంచాయతీ నిధులు సర్పంచ్ అయినా తనకు సమాచారం లేకుండా డ్రా చేయడమే కాకుండా , సానిటేషన్ వర్క్ లో కమిషన్ కోసం వేధింపు తనని వేధిస్తున్నారన్నారు. గ్రామ పంచాయితీ సెక్రటరీ శేఖర్ , ఉప సర్పంచ్ దీ రామప్ప ఇద్దరూ కలిసి గ్రామపంచాయతీ నోట్ ఫైల్ పై ఖాళీ స్థలంలో శానిటైజేషన్ కింద తేదీ 12-08-2026 రోజు ఉప సర్పంచ్ దీ రామప్ప పేరు మీద 30,000 బ్లీచింగ్ పౌడర్ కొనకున్న కొన్నట్లు బిల్లు కొట్టడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ లోనే లేని వ్యక్తి అయినా మద్దూర్ వెంకటేశ్ పేరు మీద తేదీ 30 -06-2026 రోజూ 4500, మరియు తేదీ29-07-2026 నాడు జెసిబి రోడ్ వర్క్ నడిచినట్లు 15,000 రూపాయలు బిల్లు సర్పంచుకు తెలియకుండా డ్రా చేసుకోవడం జరిగిందన్నారు. తనను సాూలు అడగకుండానే నిధులు డ్రా కావడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ ఆధీనంలో నిర్మిస్తున్న కొత్త ఇల్లు పర్మిషన్ ఈడిగి





దస్తయ్య o/శీ మల్లయ్యకు గ్రామ పంచాయతీ సెక్రెటరీ శేఖర్ సర్పంచ్ అయినా తనకు తెలుపకుండా తేదీ 27-07-2026 పర్మిషన్ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామంలో గొల్ల ఎల్లప్ప o/శీ సాయప్ప రోడ్డులో అక్రమంగా బాత్రూం నిర్మించి, అట్టి బాత్రూం కు డ్రైనేజీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు, ఇట్టి డ్రైనేజి కి సంబంధించి, గ్రామ సభలో పని గుర్తింపు, గ్రామపంచాయతీ తీర్మానం, వర్క్ ఆర్డర్ లేకుండా కూడా, ఇట్టి డ్రైనేజీ నిర్మాణానికి మొత్తం రూపాయలు 1,00000/- ఇవ్వాలని, గ్రామ ఉపసర్పంచ్ బీటి రామప్ప, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శేకర్ మూడు నెలలా నుండి బిల్లు ఇవ్వాలని డిమాండ్ పెట్టి, మహిళా సర్పంచ్ అయినా తనను వేధిస్తున్నారన్నారు. ఇట్టి బాత్రూం నిర్మాణానికి సంబంధించి సర్పంచ్ హాయంలోనే, అప్పటి గ్రామ పంచాయతీ సెక్రెటరీ మోహన్ తో నోటీసు ఇప్పించడం జరిగిందన్నారు. గ్రామంలో కుమ్మరి శంకరప్ప o/శీ పకీరప్ప, గ్రామ పంచాయతీకి సంబంధించి స్థలంలో పశువుల నీటి తొట్టి ఉండగా, అట్టి నీటి తొట్టి భాగాన్ని తీసివేసి తన బంధువుల చేత కిరాణం డబ్బా షాప్ వేసి అట్టి స్థలాన్ని ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో తలారి శ్రీనివాస్ o/శీ దస్తప్ప ఓల్డ్ స్కూల్ భాగంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల దగ్గర తన యొక్క పశువులను కట్టేసి ఆ ప్రాంగణం మొత్తాన్ని అపశుభ్రంగా చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి గ్రామపంచాయతీ సమస్యలన్నిటికీ నోటీసులు ఇవ్వమని అడిగితే గ్రామ పంచాయతీ సెక్రెటరీ శేఖర్ సార్, గ్రామ ఉపసర్పంచ్ బిటి రామప్ప, గొల్ల ఎల్లప్ప , కుమ్మరి శంకరప్ప , తలారి శ్రీనివాస్ నాపై దౌర్జన్యం చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి పరిస్థితులన్నీ పరిశీలించి ప్రభుత్వ శాఖపరమైన చర్యలు తీసుకోగలరని కోరుతున్నామన్నారు.

గ్రామ ఉపసర్పంచ్ దీ రామప్పను ఉప సర్పంచ్ పదవి నుండి తొలగించి, ఉపసర్పంచ్ కు గల చెక్ పవర్ ను మరొక వార్డు మెంబర్ కు ఇవ్వవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షులు సిహెచ్ శివయ్య ఉపాధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయండి

## గణేష్ నిమజ్జనం అనంతరం పునరుద్ధరణ పనులు వేగ వంతం చేయలి

## ఎం ఎం సి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి,



**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ నిమజ్జనం అనంతరం మినీ పాండ్లు, తాత్కాలిక చెరువులు, బేబీ పాండ్లు మరియు వాటి పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ అధికారుల ను ఆదేశించారు. రానున్న బతుకమ్మ వేడుకలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.ఈ మేరకు అదనపు కమిషనర్ (హెల్త్ ఒ శానిటేషన్)తో కలిసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నిమజ్జన ప్రదేశాల పరిస్థితి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజా సౌకర్యాలు, స్ట్రీట్ లైటింగ్, పార్కుల అభివృద్ధి తదితర అంశాలను సమీక్షించారు నిమజ్జన ప్రదేశాల పరిశుభ్రత కు ప్రాధాన్యతగణేష్ నిమజ్జనం పూర్తయిన వెంటనే నీటిని తొలగించడం, నిమజ్జనం చేసిన విగ్రహాలను బయటకు తీసి, చెరువులు, పాండ్లు పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని అధికారులకు ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాలను నిరంతరం పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు రానున్న బతుకమ్మ వేడుకల సందర్భంగా మినీ పాండ్లు, బేబీ పాండ్లు, తాత్కాలిక చెరువుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ర్యాంపులు, మెట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు నిమజ్జన ప్రదేశాల పరిశుభ్రత కు ప్రాధాన్యతగణేష్ నిమజ్జనం పూర్తయిన వెంటనే నీటిని తొలగించడం,నిమజ్జనం చేసిన విగ్రహాలను బయటకు తీసి, చెరువులు, పాండ్లు పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని అధికారులకు ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాలను నిరంతరం పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లురానున్న బతుకమ్మ వేడుకల సందర్భం గా మినీ పాండ్లు, బేబీ పాండ్లు, తాత్కాలిక చెరువుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ర్యాంపులు, మెట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు నిమజ్జన ప్రదేశాల పరిశుభ్రత కు ప్రాధాన్యత గణేష్ నిమజ్జనం పూర్తయిన వెంటనే నీటిని తొలగించడం, నిమజ్జనం చేసిన విగ్రహాలను బయటకు తీసి, చెరువులు, పాండ్లు పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని అధికారులకు ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాలను నిరంతరం పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు రానున్న బతుకమ్మ వేడుకల సందర్భంగా మినీ పాండ్లు, బేబీ పాండ్లు, తాత్కాలిక చెరువుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ర్యాంపులు, మెట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని,ఆదేశించారు.పార్కులు, కమ్యూనిటీ ప్రదేశాల అభివృద్ధి చెరువులు, పాండ్ల పరిసరాలను భవిష్యత్తులో క్రీడలు, సామాజిక, కమ్యూనిటీ కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పార్కుల అభివృద్ధిలో స్థానిక ప్రజల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని కాంపౌండ్ వాల్స్‌తో పాటు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థపై సమీక్ష

మల్కాజ్‌గిరి ఉత్తమ్ నగర్ ప్రాంతంలో స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. పనిచేయని వీధి దీపాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, చీకటి ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో లైటింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రహదారులు, ప్రజా ప్రదేశాల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు వీధి దీపాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఒక పండుగ కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు తదుపరి పండుగలకు కూడా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. అన్ని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ పారిశుద్ధ్యం, ప్రజా భద్రత, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సౌకర్యాలకు సమగ్ర ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# కృష్ణజింకను వేటాడి మాంసంతో పట్టుబడ్డ తొమ్మిది మంది

**షాద్‌నగర్‌లో పోలీస్, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్**

**మీడియా సమావేశంలో షాద్‌నగర్ డిసిపి శిరీష రాఘవేందర్ వెల్లడి**



**కొత్తూరు సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** కృష్ణజింకను వేటాడి, దాని మాంసాన్ని ముక్కలుగా నరికి నగరానికి తరలిస్తున్న తొమ్మిది మంది ముఠాను షాద్‌నగర్ పోలీసులు, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి లైసెన్స్‌డ్ తుపాకీ, బుల్లెట్లు, కృష్ణజింక మాంసం, రెండు వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ శిరీష రాఘవేంద్ర వివరాలు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం..సెప్టెంబర్ 26న అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు కార్లలో నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. సెప్టెంబర్ 27న ఉదయం లైసెన్స్‌డ్ తుపాకీతో కృష్ణజింకను వేటాడి చంపిన అనంతరం దాని మాంసాన్ని ముక్కలుగా నరికి ప్యాక్ చేసుకుని హైదరాబాద్ వైపు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా నిందితుల ముఠా పట్టుబడింది.విచారణలో కృష్ణజింకను తామే వేటాడినట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎం.డి. హాజీ ఉద్దీన్ (36), మీర్ ముక్తార్ అలీ (37), ఎం.డి. తాజుముల్ (37), మీర్ రాజా అలీ ఖాన్ (39), ఖుర్రం ఖాన్ (35), సయ్యద్ సల్మాన్ అలీ (30), ఎం.డి. అఫ్రోజ్ ఖాన్ (36), ఎం.డి. అబ్దుల్ అజీజ్ (33), ఎం.డి. రియాజ్ (28) ఉన్నారు.నిందితుల నుంచి .315 రైఫిల్, టెలిస్కోప్, సైలెన్సర్, 19 బుల్లెట్లు, సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, నల్లటి స్కార్పియో వాహనం, సుజుకి ఎస్-క్రాస్ వాహనం, ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు,రూ.28,590 నగదు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని 9, 39, 50, 51, 57 సెక్షన్లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.వన్య ప్రాణులను వేటాడటం,చంపడం,వాటి మాంసాన్ని అక్రమంగా తరలించడం లేదా విక్రయించడం



చట్టరీత్యా తీవ్రమైన నేరమని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వన్యప్రాణుల అక్రమ వేటకు సంబంధించిన సమాచారం తెలిస్తే అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1800-425-5364, 040-23231440కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.మీడియా సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, ఎస్‌వోటీ పోలీసులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షఫీ

**నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించాలని కొలన్ హన్మంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు**



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి )** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీగా సయ్యద్ షఫీ నియమితులయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సయ్యద్ షఫీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి సయ్యద్ షఫీని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మైనారిటీ వర్గాల సంక్షేమం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ, కుత్బుల్లాపూర్ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, జలీల్ ఖాన్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎం.డి. షకీల్, ఎం.డి. ఫెరోజ్, షేక్ షరీఫ్, ఎం.డి. జబ్బర్, ఎం.డి. యాసీమ్, ఖయీమ్, అఫాన్, గౌస్ భాయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్, హన్మి రెడ్డి తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళను చితకబాదిన నోముల గ్రామస్తులు.!

**చేతబడి చేస్తుందని నెపంతో ఆమెపై దాడి.!**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన..**

**బాధితుల ఫిర్యాదుతో 14 మందిపై కేసు నమోదు...**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి:** చేతబడి చేస్తుందని నెపంతో, నోముల గ్రామంలో వృద్ధ మహిళను, విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని నోముల గ్రామంలో మంత్రాలు చేతబడి చేస్తుందనే నెపంతో, అదే గ్రామానికి చెందిన వృద్ధ మహిళ (60)ను గ్రామస్తులు చెట్టుకు కట్టేసి విచక్షణ రహితంగా చితకబాదారు. దీంతో బాధితులు మంచాల పోలీసులను ఆశ్రయించగా, ఫిర్యాదు అందుకున్న పోలీసులు, దాడికి పాల్పడ్డ 14 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. వృద్ధ మహిళ వెంకటమ్మ పై విచక్షణ రహితంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

# భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

**సీపీఎం పరిగి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి**






**పరిగి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** భగత్ సింగ్ 119వ జయంతిని పురస్కరించుకొని సీపీఎం పరిగి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పరిగి పట్టణంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య మాట్లాడుతూ, భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమసమాజం కోసం పోరాడిన విప్లవ యోధుడు అని అన్నారు. యువతలో శాస్త్రీయ ఆలోచన, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. దేశంలో పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం, ఉపాధి--విద్య--వైద్యం--భూమి హక్కుల కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ కలలు కన్న దోపిడీ, వివక్ష, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని వెంకటయ్య కోరారు. ఆయన త్యాగాలు, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పరిగి ఏరియా కమిటీ నాయకులు ఎండీ . హబీబ్, ఎ. సత్యయ్య, రఘురాం, సీ సత్యయ్య, మొగులయ్య, మోహన్, నర్సిములు, వెంకటయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం..

**రూ.1.10 కోట్ల విలువైన 80 అంశాలకు గ్రీన్ సిగ్నల్ -- తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధిపై చర్చ**



**పరిగి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** పరిగి మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించిన 80 అంశాలను ప్రవేశపెట్టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు. సమావేశంలో రూ.1 కోటి 10 లక్షల విలువైన వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. పైపులైన్ల నిర్మాణం, భూగర్భ మురుగునీటి కాలువలు, కల్వర్టులు, సీసీ డ్రైన్లు, వీధి దీపాల కొనుగోలు తదితర పనులకు తీర్మానాలు చేశారు. అదేవిధంగా పలువురు వార్డుల్లో ఫిత్ వైర్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖకు రూ.2,45,181 చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ ప్రవేశ మార్గాల్లో వెల్‌కమ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు లేఅవుట్లలోని పార్కు స్థలాల రక్షణ కోసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె. మల్లేశ్, వైస్ చైర్మన్ మూలవత్ హనుమంతు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ ఎంపికపై అభ్యంతరాలు

కౌకుంట్లలో నిబంధనలు పాటించలేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

పరీక్ష, ఇంటర్వ్యూ, మెరిట్ వివరాలు ఇవ్వాలని ఆర్డీవోకు వినతి

**చేవెళ్ల, సెప్టెంబరు 28(ప్రజా జ్యోతి):** కౌకుంట్ల గ్రామ రేషన్ డీలర్ నియామక ప్రక్రియపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రక్రియ జరగలేదని పేర్కొంటూ సోమవారం ప్రజావాణిలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పరీక్ష, ఇంటర్వ్యూ, ఎంపికకు సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు. జూన్ 27న పరీక్షకు ఒక్కరోజు ముందు మధ్యాహ్నం ఫోన్ చేసి ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చి హాల్‌టికెట్ తీసుకోవాలని సమాచారం ఇచ్చారని తెలిపారు. పరీక్షకు వారం రోజుల ముందే హాల్‌టికెట్లు ఇవ్వాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఇవ్వడంపై వివరణ ఇవ్వాలని కోరారు. జూన్ 28న నిర్వహించిన పరీక్షలో ప్రశ్నపత్రాన్ని సీల్డ్ కవర్‌లో తీసుకొచ్చి అభ్యర్థుల సమక్షంలో సంతకాలు తీసుకున్న అనంతరం తెరవాల్సి ఉండగా.. నేరుగా ప్రశ్నపత్రాలు అందించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

**మెరిట్ జాబితా ఏదీ?**

కౌకుంట్ల నుంచి 16 మంది పరీక్షకు హాజరయ్యారని, పరీక్ష అనంతరం మార్కులు, మెరిట్ జాబితాను ప్రదర్శించలేదని అభ్యర్థులు తెలిపారు. ఇద్దరిని ఎంపిక చేసినట్లు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. మార్కుల వివరాలు వెల్లడించకుండా ఎంపిక ఎలా చేపట్టారో తెలియజేయాలని కోరారు.

**ఇంటర్వ్యూ వివరాలు వెల్లడించాలి**

ఇంటర్వ్యూకు ఇద్దరిని పిలిచి వారిలో ఒకరిని ఎంపిక చేశారని, ఎంపికైన అభ్యర్థికి మాత్రమే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని తెలిపారు. మిగతా అభ్యర్థులకు ఎంపిక వివరాలు తెలియజేయలేదని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నల పత్రం, వీడియో రికార్డింగ్ ఉంటే అందించాలని కోరారు.

**ఉన్నత విద్యార్హతలున్నా..**

పరీక్ష రాసిన 16 మందిలో 13 మంది డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంబీఏ వంటి విద్యార్హతలు కలిగిన వారున్నారని అభ్యర్థులు తెలిపారు. అయినా ఇంటర్ చదివిన అభ్యర్థి ఎంపిక కావడంపై తమకు సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ తమ్ముడు కె. సత్యనారాయణగౌడ్ (బీఎస్సీ, ఎంఏ) ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినా ఎంపిక కాలేదని, కారణం వెల్లడించాలని కోరారు. నియామక ప్రక్రియను పూర్తిగా



పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థికి అవకాశం కల్పించాలని అధికారులను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె. శ్రీనివాస్ (ఎంఏ, బీఈడీ), కె. సత్యనారాయణగౌడ్ (బీఎస్సీ, ఎంఏ), కె. కృష్ణయ్యగౌడ్ (డిగ్రీ, ఎంబీఏ) ఉన్నారు.

# పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి!

నవంబర్ 6లోగా ఫారం--18 ఇవ్వాలి

పాత ఓటర్లూ కొత్తగా అప్లై చేయాల్సిందే

2026 నవంబర్ 1 నాటికి మూడేళ్లు పూర్తయిన డిగ్రీ అర్హత

చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డి

**చేవెళ్ల, సెప్టెంబరు 28 (ప్రజా జ్యోతి):** పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పనకు ఈ--నోట్ ప్రక్రియ షురూ అయింది. మల్కాజిగిరి--రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6లోగా ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ నోటీసు బోర్డులో అధికారిక నోటీసును ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరు నమోదుకు అర్హులని ఆర్డీవో చెప్పారు. డిగ్రీ, డిప్లొమా ధ్రువపత్రం లేదా మార్కుల పట్టిక వంటి విద్యార్హత



పత్రాలను దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తున్నందున గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా మరోసారి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫారం--18 సమర్పించే అవకాశం ఉందన్నారు. సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, రంగారెడ్డి, మెదక్--మల్కాజిగిరి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలు ఈ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఒక వ్యక్తి లేదా సంస్థ పెద్ద సంఖ్యలో దరఖాస్తులను సమూహంగా సమర్పించడానికి అనుమతి లేదన్నారు. కుటుంబ సభ్యుల దరఖాస్తులను మాత్రం ఒకే కుటుంబ సభ్యుడు సంబంధిత ఆధారాలతో సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుల్లో తప్పుడు సమాచారం ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. ప్రజా ప్రతినిధుల చట్టం--1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన పట్టభద్రులు గడువు ముగిసేలోగా ఫారం--18 సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో పార్థసింహ రెడ్డి కోరారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** ఈసీఐలో ముగ్గురు సభ్యులు కలిగిన కమిటీలో ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తూ బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్ల చోరీకి అవకాశం కల్పించిన జ్ఞానేశ్ కుమారు తక్షణమే రాజీనామా చేయాలి సిపిఐ జాతీయ సమితి సభ్యులు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు.సోమవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో సిపిఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగింది ముఖ్యఅతిథిగా జంగయ్య పాల్గొని మాట్లాడారు.ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఓట్ల చివరికి పాల్పడే అవకాశం కల్పించిన ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే పార్లమెంటులో చర్చించి సస్పెండ్ చేయాలని జంగయ్య డిమాండ్ చేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడానికి అధికారులను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకుల ఎన్నికల దరఖాస్తులను తిరస్కరించే కుట్రలు చేస్తూ ఇతర పార్టీల ఎమ్మెల్యే ఎంపీలను ప్రలోభ పెట్టి బిజెపిలోకి చేరే విధంగా ఈ డి. సి బి ఐ ఎన్నికల అధికారులను వాడుతున్నదని ఆయన విమర్శించారు.ఎన్నికల హామీలను అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో వ్యతిరేకతను పోగొట్టడానికి మతాన్ని ఒక ఆయుధంగా మలుచుకొని రాజకీయాలు చేయడం సిగ్గుమాలిన చర్యని ఆయన విమర్శించారు.ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించే ప్రధాన ఎన్నికల అధికారులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఓట్లను తొలగించే కుట్ర చేయడం రాజ్యాంగ విరుద్ధమని అలాంటి వ్యక్తులను తక్షణమే సస్పెండ్ చేయకపోతే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని జంగయ్య అన్నారు.జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర




కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి,యాదిరెడ్డి, రామకృష్ణ,శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, పల్నాటి యాదయ్య, యాదగిరి, నీలమ్మ, శివకుమార్, రియాజ్, దత్తు నాయక్,చందు యాదవ్, మల్లేష్, పాలమాకుల శ్రీశైలం, శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, విజయ్ ఆనంద్ గౌడ్,రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ లో దారుణ ఘటన

క్యాబ్‌లో ప్రయాణికురాలిపై అఘాయిత్యానికి యత్నం

రూటు మార్చి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన క్యాబ్ డ్రైవర్

కేకలు వేయడంతో 60 వేల నగదు ఉన్న బ్యాగుతో అపహరణ పరార్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** ఓ మహిళా ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నించి మహిళ దగ్గర బ్యాగులో ఉన్న 60000 నగదుతో పరారైన ఘటన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళితే జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు క్యాబ్‌లో వస్తున్న మహిళను తొండుపల్లి టోల్‌ప్లాజా దాటిన తర్వాత డ్రైవర్ రూటు మార్చి కొత్వాల్‌గూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించగా బాధితురాలు అప్రమత్తమై కేకలు వేయడంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఇదే సమయంలో ఆమె బ్యాగులో ఉన్న రూ.60 వేల నగదును డ్రైవర్ తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో మహిళ పేర్కొన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన మహిళ సెప్టెంబరు 26న సాయంత్రం జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు క్యాబ్‌లో బయలుదేరింది. శంషాబాద్ చేరుకున్న తర్వాత గచ్చిబౌలి వెళ్లేందుకు డ్రైవర్ అదనంగా రూ.50 చెల్లించాలని కోరగా ఆమె అంగీకరించారు. అయితే తొండుపల్లి టోల్‌ప్లాజా దాటిన అనంతరం డ్రైవర్ వాహనాన్ని ఔటర్ రింగ్ రోడ్డుపై కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డువైపు మళ్లించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. కొంతదూరం వెళ్లిన తర్వాత కొత్వాల్‌గూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో వాహనాన్ని నిలిపి తనపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ఆమె ఆరోపించింది. దీంతో అప్రమత్తమైన మహిళ డ్రైవర్‌ను ప్రతిఘటించి కారు నుంచి బయటకు వచ్చి గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికులు వస్తారన్న భయంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అయితే అప్పటికే బాధితురాలి బ్యాగులో ఉన్న రూ.60 వేల నగదుతో క్యాబ్ డ్రైవర్ పరారయ్యాడని మహిళ ఫిర్యాదు చేసింది. ఘటన అనంతరం స్థానికుల సహాయంతో బాధితురాలు ఆర్జీఐఏ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తొండుపల్లి టోల్‌ప్లాజా, సర్వీస్ రోడ్డు, కొత్వాల్‌గూడ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# అది జింక మాంసమే..

సీసీఎంబి టెస్ట్ ద్వారా గుర్తించిన కొత్తూరు పశు వైద్య అధికారిని పద్మిని





**కొత్తూరు సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** షాద్ నగర్ పరిధిలోని రాయికల్ టోల్గేట్ వద్ద జింక ఎస్ఓటి పోలీసులు తనిఖీల ద్వారా పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే అది జింకమాంసమేనా, కాదా అన్నదానిపై కొత్తూరు పశువైద్య అధికారిని పద్మిని పరీక్షలు నిర్వహించారు. సీసీఎంబి టెస్ట్ ద్వారా అది జింక మాంసమేనని నిర్ధారించారు. దానికి సంబంధించిన షాంపుల్స్ సేకరించడం ద్వారా సేకరించిన వివరాలను విచారణ అధికారులకు అందజేశారు. ఈ సంఘటనలో ఇప్పటికే పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వారి నుంచి వాహనాలు, రివాల్వర్ కూడా స్వాధీనం చేసుకున్నారు. జింక మాంసం నిర్ధారణ ద్వారా పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు.

# రాఘువేందర్ నగర్ కాలనీలో గార్బేజిని తొలగించండి

ఆకతాయిలకు అడ్డాగా మారిన రాఘవేంద్ర నగర్ కాలనీ

వెనకాల దోబీ ఘాట్

బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల



**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి** :ఉమ్మడి చిలకానగర్ డివిజన్ లో నీ ప్రస్తుత బీరప్ప గడ్డ డివిజన్లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ధోబి గాడు వెనకాల భాగంలో బాగా గార్బేజ్ నిండిపోయి జనవాసులకు బాగా ఇబ్బంది కలుగుతుందని డెంగ్యూ మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాప్తించి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కాలనీ వాసులతో ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది దానికి స్పందనగా సోమవారం ఎస్ సి రమేష్ బాబు .డి ఈ వెన్నెల్ గౌడ్, మరియు ఏఈ రాజ్ కుమార్ తో కలిసి రాఘవేందర్ నగర్ కాలనీలోని దోబిగాడు వెనకాల ఉన్న భాగాన్ని వారికి చూపించడం జరిగింది, వర్షాకాలంలో వర్షం నీటితో ఇక్కడ ప్రాంతమంతా బాగా బురద మయమయి పందులు కుక్కలతో చాలా ఇబ్బంది ఏర్పడుతుందని విష జ్వరాలు వ్యాప్తిస్తున్నాయని ఇదే కాకుండా అక్కడ, కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు దానిని ఆవులను బర్రెల ను కట్టేసి గడ్డి మోపులను అక్కడ జమ చేస్తున్నారని దానివల్ల తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, రాత్రిపూట ఆకతాయిలతో గంజాయి బాబులతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందని మహిళలు ఎస్ సి విన్నవించు కున్నారు, దానికి వెంటనే కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరచి పిల్లలకు ఆడుకునే ఆట స్థలంగా తీర్చిదిద్దాలని రెండు వైపులా గేటుని ఏర్పాటు చేయాలని, 9 ఫీట్ల ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని వారిని విజ్ఞప్తి చేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎస్సీ రమేష్ బాబు గారు వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. రాఘవేంద్ర నగర్ కాలనీ వాసులు దేవేందర్ రెడ్డి, శ్రీధర్, మధుసూదన్ రెడ్డి,రజనీ, సిరి వర్ధన్, శ్రీకాంత్ మొదలగు వారు పాల్గొన్నారు.

# 1కోటి .80 లక్షలతో జజ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. సిఎంసీ నిధుల ద్వారా ?1కోటి .80 లక్షల వ్యయంతో సర్దార్‌జీ బస్తీ (గణేష్ ఆలయం) నుండి మహాదేవ్‌పూర్ వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రాంతంలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, డీసీసీ సెక్రటరీ గణేష్, లాయక్, డిస్ట్రిక్ట్ మైనారిటీ జనరల్ సెక్రటరీ షఫీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి నయీమ్, గంట శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు కె. వెంకట్ రెడ్డి, డి. జగదేశ్వర్ రెడ్డి, ఎం. రంగారావు, డి. ప్రసాద్ బాబు, పి. రాంచంద్రారెడ్డి, ఆర్. ప్రవీణ్ కుమార్, ఇ. ప్రభాకర్ రెడ్డి, పి. వెంకట్ రెడ్డి, బి. నరేంద్ర రెడ్డి, పి. రామకృష్ణా రెడ్డి, ఎస్. యాదగిరి, డి. మహేశ్వర్ రెడ్డి, కె. నవీన్ రావు, డి. మల్లా రెడ్డి, టి. రంజిత్, ఎ. మల్లా రెడ్డి, జి. దేవేందర్ రెడ్డి, వి. వెంకట్ రెడ్డి, జె. మధుసూధన్ రెడ్డి, ఎం. శ్రీనివాస రెడ్డి, పి. శ్రీనివాస రావు, ఎ. దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల కోసం -- అభివృద్ధి కోసం కుత్బుల్లాపూర్ ప్రగతి కోసం.

# ఫ్యూచర్ స్కిల్స్‌కు.. ఫ్రీ ట్రైనింగ్

ఏఐ.. సైబర్ సెక్యూరిటీపై 80 గంటలకు పైగా శిక్షణ

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హనీవెల్ కార్యక్రమం



**చేవెళ్ల సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి):** చదువుతోపాటు ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ నేర్చుకుంటేనే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని భారత్ కేర్స్‌కు చెందిన మహమ్మద్ షఫీకుద్దీన్ అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు హనీవెల్ ఫ్యూచర్ స్కిల్స్ ఎడ్జ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హనీవెల్ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో భారత్ కేర్స్ సహకారంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై విద్యార్థులకు 80 గంటలకు పైగా శిక్షణ అందిస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులతోపాటు మెంటార్‌షిప్, ప్రాక్టికల్ ప్రాజెక్టుల ద్వారా ఆయా రంగాల్లో ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు.

**స్కిల్స్ పెంచుకోవాలి**

ఈ సందర్భంగా మహమ్మద్ షఫీకుద్దీన్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీతోపాటు టెక్నికల్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త రంగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, ప్రాక్టికల్‌గా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కోరారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు అఖిల కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# లాంఛనంగా ది అన్‌చార్టెడ్ ఆర్టెరీ పుస్తకావిష్కరణ

ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రముఖ యోగా గురువు కమలేష్ అలియాజ్(దాజీ)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి

ధ్యానం, యోగావంటి సాధనల ద్వారానే మానసిక ప్రశాంతత - కీర్తిరెడ్డి





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)**:రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో సోమవారం డాక్టర్ శరత్ రెడ్డి రచించిన ది అన్‌చార్టెడ్ ఆర్టెరీ హార్ట్‌ఫుల్‌నెస్ క్యాంపస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై "ది అన్‌చార్టెడ్ ఆర్టెరీ పుస్తకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శారీరక, మానసిక సంతృప్తే.. నిజమైన ఆంతర్యామిని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, రచయిత,హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన ఉద్యమ గ్లోబల్ గైడ్ కమలేష్ డి.పటేల్ అలియాజ్ (దాజీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక ధ్యాన కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి పాల్గొని స్థానికులతో కలిసి మెడిటేషన్ చేశారు.ప్రకృతి ఒడిలో, ప్రశాంతమైన వాతావరణంలో ఇలాంటి ఆధ్యాత్మిక, మానసికోల్లాస కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్నిచ్చిందన్న కీర్తిరెడ్డి సమాజంలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న ఈరోజుల్లో ప్రతి వ్యక్తి ధ్యానం, యోగా,ఆధ్యాత్మిక సాధనల ద్వారా మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు.అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ మానసిక నిపుణులు, ఆధ్యాత్మిక గురువులు, సంఘ పెద్దలను కలిసి వారి అనుభవాలను తెలుసుకున్నారు.శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత,ఆధ్యాత్మిక చింతన కూడా మనిషి సంపూర్ణ జీవితానికి ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

# ఆత్మహత్య పాల్పడ్డ జిహెచ్ఎంసి డ్రైవర్.!

**ఆదిభట్ల సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి:**కుర్మల్‌గూడలోని అపార్ట్మెంట్లో నివాసముంటున్న అంబన్న అనే డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని, బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని ఓ అపార్ట్మెంట్ రెండో అంతస్తులో నివాసముంటున్న అంబన్న (23) అనే వ్యక్తి జిహెచ్ఎంసిలో డ్రైవర్గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగించేవాడు. ఇటీవల తన భార్య ప్రసవం అనంతరం పుట్టింటికి వెళ్లడంతో తను ఒక్కడే ఉండేవాడు. గత మంగళవారం 22 తారీఖున మృతుడి విధులకు వెళ్లడానికి, అతని తండ్రి నిద్ర లేపడానికి తెల్లవారుజామున వచ్చి తలుపు తట్టినా మృతుడు తీయకపోవడంతో, కిటికీ నుంచి గదిలోకి చూడగా, అంబన్న ఫ్యాన్ కొక్కెనుకు వేలాడుతూ కనిపించగా చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దించాడు. అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. ఆలస్యంగా ఈనెల 28 ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో మృతుడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. అంబన్న మద్యానికి బానిసై మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని, అతని మరణం పట్ల ఎలాంటి అనుమానాలు లేవని, మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

ఉపాధ్యాయుడిని మృత్యువై కబళించిన రోడ్డు ప్రమాదం

బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం అక్కడే మృతి





**యాచారం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** నిత్యం ఎక్కడో ఓ చోట జరిగే రోడ్డు ప్రమాదాలు వ్యక్తుల పాలిట మృత్యు పాశాలై కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని రోడ్డు ప్రమాదం మృత్యువై కబళించింది. రోజు మాదిరిగానే విధులకు వెళుతున్న ఉపాధ్యాయుడిని మృత్యువు తన ఒడిలోనికి చేర్చుకుంది. సోమవారం సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..యాచారం గ్రామానికి చెందిన మస్కు సంతోష్ కుమార్ (46) వృత్తిరీత్యా చౌదర్పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.
అయితే రోజు మాదిరిగానే విధులకు వెళుతున్న సంతోష్ సోమవారం యాచారంలోని కరెంటు ఆఫీసు పక్కనుంచి చౌదర్పల్లికి వెళుతుండగా బైక్ పై వెళ్తున్న అతని బైకు (టీఎస్ 07 జిక్యు 9593) ను గుర్తు తెలియని వాహనం ఒక్కసారిగా ఢీకొంది. దీంతో ఆయనకు బలమైన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా తన భర్త మరణానికి కారణమైన గుర్తు తెలియని వాహన డ్రైవర్ పట్ల సమగ్రమైన విచారణ జరిపించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుని భార్య వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# భక్తుల సౌకర్యమే లక్ష్యం.. పుష్కరిణి శుభ్రత

సొంత నిధులతో వినాయక విగ్రహాల తొలగింపు

దసరా ఉత్సవాలకు ముందే పరిశుభ్రత చర్యలు





**చేవెళ్ల, సెప్టెంబరు 28 (ప్రజా జ్యోతి):** భక్తుల సౌకర్యమే లక్ష్యంగా చేవెళ్ల పుష్కరిణి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం అనంతరం పుష్కరిణిలో మిగిలిన వినాయక విగ్రహాలను బండారి శ్రీనివాస్ రెడ్డి (చెన్నారెడ్డి) సొంత నిధులతో రాళు ,, స్టీల్ హిటాచీ సహాయంతో బయటకు తీయించి శుభ్రం చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో, 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దసరా నవరాత్రులకు పుష్కరిణికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా పరిశుభ్రత పనులు చేపట్టామని తెలిపారు. పుష్కరిణి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. పుష్కరిణిలోని విగ్రహాలతో పాటు ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, కృష్ణ నాయక్, పూజారి వైభవ్ పంతులు, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, కో ఆప్షన్ సభ్యుడు ఫరీన్ ఖదీర్ పాషా, మాజీ డైరెక్టర్ అబ్దుల్ గని తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమించిన వ్యక్తి మరణం తట్టుకోలేక యువతి ఆత్మహత్య

ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దేశ్వర కాలనీలో ఘటన

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆర్జీఐఏ పోలీసులు





**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** ప్రేమించిన వ్యక్తి మరణం తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దేశ్వర కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బూర నర్మద (19) అనే యువతి తన అక్క నివాసంలోని బెడ్‌రూమ్‌లో ఉరికి వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలో చేతిరాతతో కూడిన ఓ నోట్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నోట్‌లోని వివరాలు, ఫిర్యాదుదారుడి వాంగ్మూలం ఆధారంగా నర్మద సిద్ధార్థ్ బేజని గౌడ్ అనే యువకుడిని ప్రేమించినట్లు తెలుస్తోంది. సుమారు 15 రోజుల క్రితం సిద్ధార్థ్ ప్రమాదంలో మృతి చెందడంతో నర్మద తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సంబంధిత ఆధారాలను సేకరించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్‌టీఆర్ నగర్‌లో(దర్బార్ మైసమ్మ బస్తీ) లో రూ.27 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )** రోడమేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ దర్బార్ బస్తీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.27 లక్షల నిధులతో శంకుస్థాపన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగనుంది.ఈ కార్యక్రమంలో కే కే ఎం ట్రస్ట్ అధినేత, మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్ పాటు స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్ మరియు బస్తీ వాసులు సత్యనారాయణ, ప్రసాద్, రమేష్, వేణు, శ్రీను, అలీ, స్థానిక కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు కాజా, బలరాం, రాజిరెడ్డి, రఘు రెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా... ఆరోగ్యకరమైన సమాజం వైపు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి )** నాషా ముక్తా భారత్ కార్యక్రమంలో భాగంగా గాజులరామారం బస్తీ దవాఖానా మరియు పల్లె దవాఖానా వైద్యాధికారులు డా. ఝాన్సీ రాణి , డా. టి. శ్రీచంద్రిక, ఆశా కార్యకర్తలు కలిసి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ముఖ్యంగా చిన్నారులు, యువత మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్ ఫ్రీ ఇండియా కోసం ప్రతిజ్ఞ చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి , మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని, మన పిల్లల భవిష్యత్తును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు.
"మత్తుకు నో చెప్పండి... మన పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి."
"డ్రగ్స్ లేని భారత్ -- ఆరోగ్యవంతమైన భారత్."

# శ్రీనివాస కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆహ్వానం



**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి** :తిరుమల తిరుపతి దేవస్థానముల వారి ఆధ్వర్యం లో నిర్వహించనున్న శ్రీనివాస శ్రీ కళ్యాణోత్సవంకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని నిర్వాహకులు ఆహ్వానించారు.నాచారం బి.ఆర్.టి. ఎంక్లేవ్, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేయనున్న ఈ శ్రీనివాస కళ్యాణోత్సవం అక్టోబర్ 31, 2026న శనివారం సాయంత్రం 3 గంటలకు వైభవంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భం గా అక్టోబర్ 29, 30, 31 తేదీల్లో ఉదయం 5 గంటలకు హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్, నాచారం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ చైర్మన్ నందికొండ శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసి కళ్యాణోత్సవానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు.

# కొండాపూర్‌లో కొత్త ఆశ్రయ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎంసీ కమిషనర్




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో గిగ్,డెలివరీ కార్మికుల కోసం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన కొత్త ఆశ్రయ కేంద్రాన్ని సీఎంసీ కమిషనర్ ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం,అమెజాన్ ఇండియా భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గిగ్ కార్మికులకు పని సమయంలో అవసరమైన విశ్రాంతి మరియు ప్రాథమిక సౌకర్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కుదిరిన అవగాహన ఒప్పందం లో భాగంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మెట్రోపాలిటన్ ఏరియా డ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మార్గదర్శకత్వంలో ఆశ్రయ కేంద్రాల ఏర్పాటు కార్యక్రమం ముందుకు సాగుతోంది. గిగ్ కార్మికులు సులభంగా చేరుకునే ప్రాంతాల్లో ఇటువంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం లక్ష్యం.గిగ్,డెలివరీ కార్మికులకు నగరం వారి పని ప్రదేశం కూడా.ప్రతిరోజూ వారు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎక్కువ సమయం రహదారులపై ప్రయాణిస్తూ,ఒక డెలివరీ నుంచి మరో డెలివరీకి నిరంతరం వెళ్తుంటారు. పని సమయంలో కొంతసేపు ఆగి విశ్రాంతి తీసుకునేందుకు వారికి పరిమిత అవకాశాలు ఉంటాయి.ఈ నేపథ్యంలో ఆశ్రయ కేంద్రం వారికి కొంతసేపు ఆగేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు,రీఛార్జ్ చేసుకునేందుకు మరియు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను వినియోగించుకునేందుకు ప్రత్యేక స్థలాన్ని అందిస్తుంది.కొండాపూర్‌లోని ఆశ్రయ కేంద్రం అన్ని గిగ్ మరియు డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసే కార్మికులకు అందుబాటులో ఉంటుంది.వారు ఏ కంపెనీ లేదా ప్లాట్‌ఫామ్‌కు చెందినవారైనా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఈ సమగ్ర విధానం ద్వారా గిగ్ వర్కర్ల విస్తృత వర్గానికి ఆశ్రయ కేంద్రం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నారు.ఆహారం,వస్తువులు,ఇతర అవసరమైన సేవలను నగరంలోని ప్రజలకు చేరవేయడంలో గిగ్,డెలివరీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రతిరోజూ నగరాన్ని చురుకుగా ముందుకు నడిపించే ఈ కార్మికుల అవసరాలను గుర్తిస్తూ,వారికి మరింత అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు ఆశ్రయ కార్యక్రమం దోహదపడుతుంది.గిగ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి ప్రాథమిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరింత కార్మికులకు అనుకూలమైన, సమగ్ర,సౌకర్యవంతమైన నగర వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎంసీ చర్యలు కొనసాగిస్తోంది.

# యువ ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

**ప్రభుత్వ పథకాలు, తెలంగాణ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లదే కీలక పాత్ర**




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది.తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు,ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శ్రులత రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో, ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు,వివిధ విభాగాలు, పాల్గొనే విధానం తదితర అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం యువ కళాకారులు,కంటెంట్ క్రియేటర్లు, ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్ఫ్లుయెన్సర్లు విస్తృతంగా భాగస్వాములు కావాలని సూచించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు,బతుకమ్మ పండుగ విశిష్టతతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలనకు సంబంధించిన సమాచారాన్ని సృజనాత్మక డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని సమావేశంలో పేర్కొన్నారు. ఇన్ఫ్లుయెన్సర్ల విభాగంలో తెలంగాణ ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలనపై రీల్స్, డిజిటల్ స్టోరీటెల్లింగ్ ద్వారా కంటెంట్ రూపొందించేందుకు అవకాశం కల్పించారు.యువ ఫిల్మ్ మేకర్లు, ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు,బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి,అనిల్,అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ సమాయత్తం!

**పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కేటీఆర్ దిశానిర్దేశం**



**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల కసరత్తును ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల బాధ్యతలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పట్టభద్రుల ఓటర్ల నమోదే కీలకం: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయానికి కాకుండా ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని నాయకులకు సూచించారు. ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ క్రియాశీలకంగా వ్యవహరించాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పట్టభద్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని పార్టీ నాయకత్వం సూచించినట్లు సమావేశ వర్గాలు వెల్లడించాయి.

# ఆశ్రయ్ కేంద్రాన్ని ప్రారంభించిన సైబరాబాద్ కమిషనర్ జి సృజన




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**జయేష్ రంజన్, ఐఏఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో కొండాపూర్‌లో నూతన ఆశ్రయ్ కేంద్రాన్ని ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్ తెలంగాణ ప్రభుత్వం,అమెజాన్ ఇండియా భాగస్వామ్యంలో కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన సరికొత్త ఆశ్రయ్ కేంద్రాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఐఏఎస్ గారు ఈరోజు ఘనంగా ప్రారంభించారు.ఈ ఏడాది ప్రారంభంలో తెలంగాణ ప్రభుత్వం, అమెజాన్ ఇండియా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం హైదరాబాద్ వ్యాప్తంగా ఈ ఆశ్రయ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరం రోడ్లపై ప్రయాణిస్తూ సేవలు అందించే డెలివరీ భాగస్వాములు,గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం అమెజాన్ ఇండియా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్ మాట్లాడుతూ.. కొండాపూర్‌లో ఈ నూతన ఆశ్రయ్ కేంద్రాన్ని సకాలంలో విజయవంతంగా ఏర్పాటు చేయడానికి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఐఏఎస్ ఎంతో కృషి చేశారని ప్రత్యేకంగా కొనియాడారు. క్షేత్రస్థాయిలో ఆయన చూపిన చొరవ, పర్యవేక్షణ వల్లే ఈ ప్రాజెక్ట్ వేగంగా అందుబాటులోకి వచ్చిందని ఆమె అభినందించారు.

**ముఖ్యమైన విశేషాలు:**


అందరికీ ఉచిత ప్రవేశం: ఈ కేంద్రాలు కేవలం అమెజాన్ డెలివరీ బాయ్స్ కోసమే కాకుండా, నగరంలోని ఏ ప్లాట్‌ఫామ్‌కు చెందిన డెలివరీ భాగస్వాములైనా ఉచితంగా వాడుకోవచ్చు. నగరంలో విస్తరణ: కొండాపూర్‌తో పాటు తెల్లాపూర్, పటాన్‌చెరు, భారతీనగర్, చందానగర్ పరిధుల్లో కొత్తగా 5 ఎయిర్ కండిషన్ కేబిన్లను ఏర్పాటు చేయడంతో, సైబరాబాద్ పరిధిలో మొత్తం ఆశ్రయ్ కేంద్రాల సంఖ్య 14కు చేరింది.

**కల్పించిన సదుపాయాలు:**

విశ్రాంతి తీసుకోవడానికి ఏసీ రూమ్ మరియు సీటింగ్ సదుపాయం.మొబైల్స్ ఛార్జ్ చేసుకోవడానికి ఛార్జింగ్ పాయింట్లు.ఉచిత వై-ఫై ఇంటర్నెట్ సౌకర్యం.స్వచ్ఛమైన తాగు నీరు వాష్‌రూమ్ వసతి.అత్యవసర పరిస్థితుల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్.డెలివరీ భాగస్వాములు శారీరకంగా అలసిపోకుండా, కాసేపు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుని మళ్లీ సేవలందించేందుకు ఈ ఆశ్రయ్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ (ఉప కమిషనర్) తో పాటు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఇతర ఉన్నతాధికారులు,అమెజాన్ ఇండియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ లో రోడ్డు ప్రమాదం

**బుల్లెట్ బైక్ అదుపుతప్పి బోల్తా, వ్యక్తి మృతి**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆర్జీఐఏ పోలీసులు**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** ఓ బుల్లెట్ బైక్ అద్భుతప్పి బోల్తాపడడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి కిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాళ్లగూడ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శంషాబాద్ సర్కిల్ కిషన్ గూడ రాయల్ విల్లలో నివాసముండే కర్ల చంద్రశేఖర్ చౌదరి (30) తన రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ (టిఎ 07 జీఔ 0869) బైకుపై శంషాబాద్ లోని రాళ్లగూడ ఓఆర్ సర్వీస్ రోడ్డుపై ప్రయాణిస్తుండగా ఒకసారిగా రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో బైకు నడుపుతున్న చంద్రశేఖర్ చౌదరికి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# టిఫిన్ తెస్తానని వెళ్లి.. తిరిగి రాలే

**చేవెళ్లలో మహిళ అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు**



**చేవెళ్ల, సెప్టెంబరు 28(ప్రజా జ్యోతి):** టిఫిన్ తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా పానగల్ మండలానికి చెందిన గువ్వల అగ్గరయ్య తన భార్య మంజుల (27)తో కలిసి పని నిమిత్తం కొద్దిరోజుల క్రితం చేవెళ్లకు వచ్చారు. వికారాబాద్ రోడ్డు సమీపంలో తాత్కాలిక గుడిసె ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటల సమయంలో మంజుల టిఫిన్ తీసుకువస్తానని చెప్పి గుడిసె నుంచి బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో భర్త పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికాడు. స్వగ్రామంలోనూ ఆరా తీసినా ఆమె ఆచూకీ లభించలేదు. మంజుల వద్ద మొబైల్ ఫోన్ కూడా లేదని తెలిపారు. ఆచూకీ కోసం: మంజుల ఎత్తు సుమారు ఐదు అడుగులు. గోధుమ వర్ణం. తెలుగు మాట్లాడుతుంది. అదృశ్యమైన సమయంలో తెలుపు రంగు చీర, నలుపు రంగు జాకెట్/బ్లౌజ్ ధరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా చేవెళ్ల పోలీసులను సంప్రదించాలని కోరారు.

# ఆసియాడ్ స్వర్ణ విజేత మహిళల కబడ్డీ జట్టు కోచ్ నీత దడ్వేకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత మహిళల కబడ్డీ జట్టును స్వర్ణ పథక విజేతగా నిలిపిన కోచ్, నీత దడ్వే శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఆమెకు ఘన స్వాగతం లభించింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కబడ్డీ క్రీడాకారులు పూలమాలలు, శాలువాలతో నీత దడ్వేను సత్కరించారు. ఆసియాడ్‌లో భారత మహిళల కబడ్డీ జట్టు అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పథకం సాధించడంలో నీత దడ్వే అందించిన సమర్థవంతమైన మార్గదర్శకత్వం వ్యూహాత్మకత శిక్షణ కీలకంగా నిలిచిందని ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు. దేశానికి కీర్తి తెచ్చిన కోచ్‌ను తెలంగాణ ప్రభుత్వం తరఫున అభినందించారు. ఆమె శిక్షణలో మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్ రెడ్డి, సలహాదారులు జగదీష్ యాదవ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ కుమార్, వీఆర్వో కాలేరు సురేష్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# కీందిబస్తీకి ఆధునిక కమ్యూనిటీ హాల్.. జోనల్ కమిషనర్‌కు వినతి




**అల్వాల్ సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి)** కౌకూర్ కీందిబస్తీ బజన్ మందిర్ వద్ద ఆధునిక రెండు అంతస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనంపల్లి హనుమంత్ రావు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.కీందిబస్తీ బజన్ మందిర్ వద్ద ప్రస్తుతం ఉన్న చిన్న కమ్యూనిటీ హాల్ స్థానిక ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని మల్లికార్జున్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న జనాభా, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో రెండు అంతస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిపాదిత కమ్యూనిటీ హాల్‌ను మహిళా సాధికారతకు వేదికగా ఉపయోగించడంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ, యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా అభివృద్ధి చేయాలని వివరించారు. అలాగే స్థానిక ప్రజల వివాహాలు, సమావేశాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించినట్లు మల్లికార్జున్ తెలిపారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నకిలీ ఎరువులు, మందులు విక్రహిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి కవిత



**ధారూర్, సెప్టెంబర్ 28( ప్రజా జ్యోతి):** మండలం కేంద్రంలోని ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఏ.డి.ఏ సందీప్ లు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని మన గ్రోమర్ సెంటర్, తుల్జా భవాని, వెంకటేశ్వర ఫర్టిలైజర్, కిసాన్ అగ్రోస్ వంటి ఆయా దుకాణాలలో సందర్శించి తనిఖీ చేశారు. నకిలీ ఎరువులపై ఆరాతీసి, ఎరువుల దుకాణం లోని స్టాక్‌ను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. నకిలీ ఎరువులు, మందులు విక్రిహించరాదని, ఎవరైన విక్రహిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల వ్యూహాలపై కేటీఆర్‌తో కొప్పుల మహేష్ రెడ్డి భేటీ



**పరిగి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివాసంలో నిర్వహించిన మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలు, పార్టీ కార్యాచరణ, ఎన్నికల వ్యూహాలు, నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు చర్చించినట్లు సమాచారం. సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, తెలంగాణ శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ అలాగే పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొని ఎన్నికల సన్నాహకాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటర్లతో మమేకమయ్యే కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది.

# ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీ

2 తులాల బంగారం,రూ.70 వేల నగదు మాయం

**యాలాల్ సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి** తాండూరు పట్టణ సమీపంలో మరో చోరీ ఘటన చోటుచేసుకుంది.కొడంగల్ రోడ్డు మార్గంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు 3 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.70 వేల నగదును అపహరించినట్లు సమాచారం. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది.ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు,సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

# ఎన్నికల అధికారి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ ఆరోపణ



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి):** ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల అధికారి జ్ఞానేశ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాదవ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. దేశంలో ఓటు చోరీ జరుగుతోందని రాహుల్‌గాంధీ గతంలోనే ప్రశ్నించారని, బిహార్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. ఎన్నికల కమిషన్‌లోని కొందరు అధికారుల పనితీరుపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో చిన్నచిన్న లోపాలకే ప్రజలకు నోటీసులు జారీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా పేదలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఓటర్లకు అవసరమైన ఆధారాల విషయంలో స్పష్టత ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, లేనిపక్షంలో ప్రజల్లో ఆగ్రహం పెరిగే అవకాశం ఉందని జాదవ్ ధారాసింగ్ నాయక్ అన్నారు. జ్ఞానేశ్‌కుమార్‌ను ఎన్నికల విధుల నుంచి వెంటనే తప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు నిరసనలో భాగంగా దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంతోష రాజు, మండల అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలపై సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి సృజన





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలను గుర్తించి, భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు మూడు జోన్లలో సీఎంసీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు,ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగించాయి.నేటి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా 16 అనధికార నిర్మాణాలను కూల్చివేయగా, 3 నోటీసులు జారీ చేసి, 1 అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు. జోన్‌ల వారీగా చేపట్టిన కూల్చివేతల వివరాలు: శేరిలింగంపల్లి జోన్: 6,కూకట్‌పల్లి జోన్: 4,కుత్బుల్లాపూర్ జోన్: 6,మూడు జోన్లలోనూ అనధికార నిర్మాణాల గుర్తింపు నుంచి తదుపరి చర్యల వరకు క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోంది. గుర్తించిన ప్రతి కేసును నిర్దేశిత విధానం మరియు అమల్లో ఉన్న భవన నిర్మాణ నిబంధనల ప్రకారం అవసరమైన తదుపరి చర్యలకు తీసుకెళ్తున్నారు.గుర్తించిన ప్రతి అనధికార నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, నిబంధనల ప్రకారం తగిన చర్యలు సకాలంలో చేపట్టాలని సీఎంసీ కమిషనర్ సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఆదేశించారు. అనధికార నిర్మాణాలను నియంత్రించేందుకు మూడు జోన్లలో సమన్వయంతో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతున్నాయి.నగరంలో భవన నిర్మాణ నిబంధనల అమలు, క్రమబద్ధమైన పట్టణ అభివృద్ధిని నిర్ధారించే లక్ష్యంతో సీఎంసీ తనిఖీలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిరంతరం కొనసాగిస్తోంది.

# మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రజావాణి 111 అర్జీల స్వీకరణ





**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమం అత్యంత ప్రశాంత వాతావరణం లో నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డిలతో పాటు డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుంచి అధికారుల బృందం మొత్తం 111 అర్జీలను స్వీకరించింది. భూ సమస్యలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇతర వ్యక్తిగత, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వినతులను ప్రజలు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా ఆలకించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత కాలపరిమితిలోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ స్పష్టం చేశారు.నిన్న జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం (వరల్డ్ టూరిజం డే) సందర్భంగా... మల్కాజ్‌గిరిలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్, ఫైన్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అద్భుతమైన సృజనాత్మకతను చాటుతూ వారు స్వయంగా గీసిన సుందరమైన పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు జిల్లా కలెక్టర్ మను చౌదరి యొక్క ప్రత్యేక పోర్ట్రెయిట్‌తో పాటు, 'రైజింగ్ తెలంగాణ'(రైసింగ్ తెలంగాణ) థీమ్‌తో రూపొందించిన మరో సుందరమైన చిత్రాన్ని కలెక్టర్‌కు ఎంతో గర్వంగా అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన కళాఖండాలను, వారి ప్రతిభను కలెక్టర్ మను చౌదరి అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. యువతలో ఉన్న సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించాలని, భవిష్యత్తులో వారు మరింత గొప్ప కళాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# నక్కలపల్లిలో ఘనంగా గణేష్ నిమజ్జనం పోటాపోటీగా లడ్డూ వేలంపాట



**మొయినాబాద్ : సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద వినాయకుడి లడ్డూ వేలంపాటను ఘనంగా నిర్వహించారు. లడ్డూ ప్రసాదాలను దక్కించుకునేందుకు గ్రామస్తులు, భక్తులు పోటాపోటీగా వేలంపాటలో పాల్గొన్నారు. హనుమాన్ టెంపుల్ వద్ద పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. వేలంపాటలో మొదటి లడ్డూను మల్లాపురం మల్లేష్ కుమారుడు మల్లాపురం మహేందర్ రూ.1,04,000లకు దక్కించుకున్నారు. రెండవ లడ్డూను వడ్డే శివకుమార్ రూ.51,000లకు కైవసం చేసుకున్నారు. మూడవ లడ్డూను గౌరీ చిన్న అంజయ్య రూ.26,000లకు దక్కించుకున్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, మల్లాపురం మల్లేష్, 1వ వార్డు సభ్యులు, నక్కలపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య గౌడ్, గౌండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేలంపాటను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలో వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహిస్తున్న నిర్వాహకులను గ్రామ పెద్దలు అభినందించారు.

# ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**షాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రజాజ్యోతి )** షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన చిర్ర సునీల్ (21), ప్రైవేట్ ఉద్యోగి తేదీ 27.09.2026 ఉదయం సుమారు 10:00 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సునీల్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఈ క్రమంలో నాగర్‌కుంట రోడ్డులోని మోడల్ స్కూల్ సమీపంలో అడ్వకేట్ సత్యనారాయణకు చెందిన భూమిలోని టేకు చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో సునీల్ కనిపించాడు. కుటుంబ సభ్యులు కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు ఈ ఘటనపై షాబాద్ పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నాగిరెడ్డిగూడలో ఘనంగా గణేష్ నిమజ్జనం లడ్డూ వేలంపాట

రూ.1.51 లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న సురేష్, ధర్మ, సందీప్ గౌడ్



**మొయినాబాద్ : సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంపాట కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు గ్రామస్థులు, యువకులు ఆసక్తిగా వేలంపాటలో పాల్గొన్నారు. వేలంపాటలో గ్రామానికి చెందిన సురేష్, ధర్మ, సందీప్ గౌడ్ కలిసి రూ.1,51,000లకు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. వేలంపాట సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న వారిని గ్రామ పెద్దలు, యువకులు అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ గణేష్ యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. లడ్డూ వేలంపాటకు గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# 20 ఏళ్లుగా రోడ్ల కష్టాలు.. భర్సపేట్‌లో సీసీ రోడ్లకు వినతి





**అల్వాల్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** కౌకూర్ గ్రామంలోని భర్సపేట్ బస్తీలో రోడ్ల సమస్యను పరిష్కరించి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనంపల్లి హనుమంత్ రావు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.డివిజన్ 189, యాప్రాల్ పరిధిలోని భర్సపేట్ బస్తీలో గత 20 సంవత్సరాలకు పైగా రోడ్లు మరమ్మతులకు నోచుకోక పూర్తిగా దెబ్బతిన్నాయని మల్లికార్జున్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.హౌస్ నంబర్ 4-2-104 నుంచి 4-2-31/1 మీదుగా 4-2-120/ఏ వరకు ఉన్న రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను ప్రాధాన్యతగా పరిగణించి, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు.

# ఎస్ ఐ ఆర్ అవకతవకలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



**హైదరాబాద్, సెప్టెంబర్ 28.(ప్రజా జ్యోతి):** (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తూ సోమవారం హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించింది.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల జాబితా సవరణలో ఏ ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకుండా ఎన్నికల సంఘం స్పష్టమైన విధానంతో ముందుకు సాగాలని కోరారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం సభ్యుల మధ్య అభ్యంతరాలు వచ్చినట్లు జరుగుతున్న ప్రచారంపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, మహిళా కాంగ్రెస్ తదితర అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంస్కృతిక కళారంగంలో 50 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకున్న అరుణోదయ విమలక్క



ఈరోజు ఆర్టీసీ కళ్యాణ మంటపంలో, ప్రజా అభినందన కార్యక్రమంలో తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు మన్యబోయిన కృష్ణ యాదవ్. వెంకటరమణ. పేరయ్య యాదవ్. ప్రభాకర్ తదితరులు పాల్గొని ప్రజా పోరాటాలలో విమలక్క పాత్రను అభినందించారు.

# భక్తిభావంతో మహమ్మాయి రాజేశ్వరి నవరాత్రి వేడుకలు

**అక్టోబర్ 11 నుంచి 20 వరకు విశేష పూజలు.. 17న అమ్మవారి పల్లకి సేవ ఊరేగింపు**

**ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు అందించాలి.. ఆలయ కమిటీ చైర్మన్ ఆగమయ్య, ప్రధాన అర్చకులు విశ్వేశ్వరయ్య**

**అబ్దుల్లాపూర్‌మెట్టు, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** హయత్‌నగర్‌లోని శ్రీ చక్ర సహిత మహమ్మాయి రాజేశ్వరి దేవస్థానంలో 30వ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆగమయ్య, ప్రధాన అర్చకులు జి.ఎం. విశ్వేశ్వరయ్య తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, లక్ష కుంకుమార్చన, మహా చండీ హోమం, మహా మంత్రపుష్పం తదితర విశేష పూజలను వేదోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని రోజుకో విశేష అలంకరణతో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 17న శనివారం సాయంత్రం 5.30 గంటలకు కోలాట బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, అనంతరం పురవీధుల్లో అమ్మవారి పల్లకి సేవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా వాహన పూజలు, మహా హారతి, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి సేవలో పాల్గొనాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

దేవస్థాన అభివృద్ధిలో భాగంగా ఆలయ ఆవరణలో నూతనంగా జీ ప్లస్ త్రీ భవనం, రెండో అంతస్తు, పెంట్‌హౌస్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 2025 జూలై 31 నుంచి 15 మంది విద్యార్థులతో వేద పాఠశాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పీఠాధిపతులు, మఠాధిపతుల విడిది, భక్తుల సౌకర్యార్థం అవసరమైన వసతులను కల్పించేందుకు ఈ నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ బృహత్తర నిర్మాణానికి భక్తులు, దాతలు తమ శక్తి మేరకు విరాళాలు అందించాలని కోరారు. ఒక చదరపు అడుగు స్లాబ్ నిర్మాణానికి రూ.1,816 చొప్పున, 10 చదరపు అడుగులకు రూ.18,160 విరాళంగా అందించవచ్చని తెలిపారు. విరాళాలు అందించిన దాతల పేర్లను శాశ్వతంగా శిలాఫలకంపై లిఖించనున్నట్లు వెల్లడించారు. నగదు, బంగారం, వస్తు రూపంలో కూడా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.



**విరాళాలు అందించాల్సిన బ్యాంకు వివరాలు:**
బ్యాంకు: కెనరా బ్యాంక్, హయత్‌నగర్
ఖతా పేరు: మహమ్మాయి దేవస్థాన కమిటీ
ఖాతా నంబర్: 1090101010401
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: జచీ=దీ0013315

నవరాత్రి మహోత్సవాలను భక్తుల భాగస్వామ్యంతో ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ చైర్మన్ ఆగమయ్య, ప్రధాన అర్చకులు జి.ఎం. విశ్వేశ్వరయ్య కోరారు.

# ఫార్మాసిటీ జీవో 31ని తక్షణమే రద్దు చేయించండి

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

ఇచ్చిన హామీలపై నిప్పులు చెరిగిన ఫార్మా బాధిత రైతులు

మాకు పరిహారం వద్దు మా భూములు మాకే కావాలి

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ఫార్మా బాధిత రైతుల నిరసన

నిషేధిత జాబితా భూముల్ని ఆన్లైన్లో నమోదు చేయాల్సిందే

ఇచ్చిన హామీలు అమలు చేయమంటే అరెస్టులు చేస్తారా.?

రైతుల నిరసనను ఎమ్మెల్యే సందర్శించలేదని మండిపడ్డ రైతులు

రైతులు ఆందోళనకు దిగడంతో ప్రజాభవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

ఫార్మా జీవోను రద్దు చేయాలని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు

రైతుల పాదయాత్రను పెద్ద ఎత్తున మోహరించిన పోలీసు బలగాలు

స్పష్టమైన నిర్ణయం వచ్చేవరకు ఆందోళన బాట విడవమన్న రైతులు





**యాచారం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** ఫార్మా బాధిత రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన చేపడుతుంటే రైతుల పరిస్థితిని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సందర్శించకపోవడం ఏమిటని ఫార్మా రైతులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. సోమవారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల రైతులు ఎమ్మెల్యే క్యాంప్ (ప్రజా భవన్) ఆఫీస్ వద్ద ఫార్మా బాధిత రైతులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నిరసన ఆందోళన చేపట్టారు. 'పరిహారం వద్దు - మా భూములు మాకు కావాలి, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి, పరిహారం పేరుతో మోసం వద్దు - మాకు భూమి కావాలి' అంటూ ప్ల కార్డులతో నిరసనకు దిగారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రైతులంతా మండిపడ్డారు. నాడు ఫార్మాసిటీ కోసం భూములు ఇవ్వద్దని కాంగ్రెస్ నాయకులు మొసలి కన్నీరు కార్చి రైతుల్ని మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అధికారంలోకి వచ్చాక రైతుల్ని విస్మరిస్తుందని దుయ్యబట్టారు. తమ భూములు తమకు ఇవ్వాలని తమ ఆస్తులు ఏమీ అడగడం లేదని నిప్పులు చెరిగారు. నాటి ఎన్నికల హామీలు రైతుల పాలిట నీటి మూటలుగానే మిగిలిపోయాయని తమ ఆవేదన వెలిబుచ్చారు. హామీలను మరో మారు గుర్తు చేద్దామని క్యాంప్ ఆఫీస్ కి వస్తే ఇక్కడ తమ గోడును పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఫార్మా రైతుల విషయంలో ప్రభుత్వం పట్టించుకుని వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన జరుగుతున్న క్రమంలో ఎవరు తమను సందర్శించకపోవడంతో అంబేద్కర్ చౌరస్తా వద్దకు శాంతియుతంగా పాదయాత్రగా వెళుతుండగా పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించి పోలీసులు పాదయాత్రను భంగం చేసి రైతుల్ని అరెస్టు చేసి మంచాల పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టులపై రైతులు మరింత భగ్గు మనడంతో ఉద్రిక్తత నెలకొంది. రైతుల్ని పోలీస్ స్టేషన్కు తరలిస్తుండగా ఓ రైతు బస్సులోనే ఫార్మాసిటీ జీవోను రద్దు చేయాల్సిందేనని లేదంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై అతనిని అడ్డుకున్నారు. ఫార్మా భూముల విషయంలో స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించే వరకు ఆందోళన నిరసనల బాటలు కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిరసన ఆందోళనలో ఫార్మసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల రైతులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిఓ నెం. 4తో ..... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్యాయం

**పాతపద్ధతిలోనే డిగ్రీ లెక్చరర్ల ఉద్యోగాల నియామకం జరపాలి**

**నిరుద్యోగ హక్కుల వేదిక డిమాండ్**

**సమావేశంలో మాట్లాడిన ప్రసన్న హరికృష్ణ, అశోక్, జనయ్య**




**సోమాజిగూడ,సెప్టెంబర్28(ప్రజాజ్యోతి) :** జిఓ నెం. 4తో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతుందని దాన్ని రద్దు చేసి పాతపద్ధతిలోనే డిగ్రీ లెక్చరర్ల ఉద్యగాలు నింపాలని నిరుద్యోగ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు ప్రసన్న హరికృష్ణ, అశోక్, జనయ్య, స్వప్న తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్ రిక్రూర్ట్ మెంట్లో భాగంగా డిఎస్సీలో బిఇడికి ప్రత్యేకంగా మార్కులు కేటాయించనప్పుడు జిఎల్ అకాడమిక్ ప్రత్యేకంగా మార్కులు లేనప్పుడు ఒక్క డిఎల్ లోనే అకాడమీకికు మార్కులు ఎందుకని ప్రశ్నించారు. ఏ ఉద్యోగాలకు లేని అకాడమిక్ వేయిటేజి ఒక్క డిఎల్ కు ఎందుకని డిగ్రీ స్థాయిలో విద్యార్థులకు రిసెర్చ్ అనే పదమే ఉండదని పేజిలోని 10 పేపర్లు ఉంటే ఒక్క పేపర్ లో మాత్రమే రిసెర్చ్ మెథడాలజీ ఉంటుందని అలాంటప్పుడు పిహెచ్ఐకి ప్రత్యేకంగా మార్కుల వెయిటేజి ఎందుకని ప్రశ్నించారు. డిగ్రీకి 12 మార్కులు, పిజికి 8 మార్కులు, సెట్ / నెట్లకు 5 మార్కులు, జిఆర్ఎకు 10 మార్కులు, పిహెచ్ఐకి 10 మార్కులు, రిసెర్చ్ పేపర్లకు 10 మార్కులు కేటాయించారని ఈ విధానం ద్వారా కేవలం 10 శాతం మంది అభ్యర్థులకే న్యాయం జరుగుతుందని 90 శాతం మంది డిఎల్ కు దూరం అవుతారన్నారన్నారు. విద్యార్థుల ప్రతిభను, సబ్జెక్ట్ లను కొలిచే జిఎస్ 150 మార్కులు, సబ్జెక్టుకు 300 మార్కులు పరీక్ష నిర్వహిస్తున్నప్పుడు క్వాలిటీ కలిగిన అభ్యర్థులు వస్తారని అన్నారు. అకాడమిక్ బ్యాక్రాండ్ కొలమానం ద్వారా నియామక ప్రక్రియ, ఇంటర్వ్యూ మార్కులు కేటాయిస్తే ప్రతిభకలిగిన విద్యార్థులు దూరం అవుతారని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్లో జీవో నెం. 4 నిబంధన లేకుండానే ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తిచేశారని ఆ రాష్ట్రాలలో లేని నిబంధనలు తెలంగాణాలోనే ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికే జిఓ నెం. 46, జివో నెం. 29 వంటి జిఓలు తీసుకువచ్చి సమస్యలు సృష్టించారని జిఓ నెం. 4తో మరిన్ని సమస్యలు సృష్టించి విద్యార్థుల భవిష్యత్ తో ఆడుకోవద్దని హెచ్చరించారు. జీవో నెం. 4. రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమాన్ని నిర్వహిస్తామని, అన్ని యూనివర్సిటీలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు వేణు, నవీన్రెడ్డి, ప్రణీత్, చంద్రశేఖర్, సారంగం, సుదర్శన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రామంతాపూర్ అవే మరియా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు





**ఉప్పల్,సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి :** రామంతాపూర్ అవే మరియా పాఠశాలలో డ్రగ్స్ మహమ్మారి పై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సెక్టార్ ఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మధు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుందని, మత్తుపదార్థాల వినియోగం, సరఫరా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. స్నేహితులు ఎవరైనా చెడు అలవాట్లకు గురైతే వెంటనే పోలీసులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, సమాజంలో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయ ప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అద్భుతమైన 57 ఏళ్ల ప్రయాణంతో టిఎస్ సి ఎస్ రోగులకు స్ఫూర్తి



**ఖైరతాబాద్,సెప్టెంబర్28(ప్రజాజ్యోతి) :** లండన్‌కు చెందిన 57 ఏళ్ల తలసేమియా మేజర్ రోగి అజయ్ గాంధీ నగరంలో తలసేమియా మరియు సికిల్ సెల్ సొసైటీ పై పర్యటించారు. ఆయన దాదాపు ఆరు దశాబ్దాలుగా ఈ వ్యాధితో జీవిస్తున్నారు. దీర్ఘకాలిక రక్త సంబంధిత రుగ్మతతో జీవిస్తున్నప్పటికీ, తన స్ఫూర్తిదాయకమైన జీవన ప్రయాణాన్ని, అనుభవాలను, ఎదుర్కొన్న సవాళ్లను, అందిపుచ్చుకున్న అవకాశాలను ఆయన అందరితో పంచుకున్నారు. సికిల్ సెల్ సొసైటీ లోని ఆడిటోరియంలో వందలాది తలసేమియా, సికిల్ సెల్ రోగులతో, వారి తల్లిదండ్రులతో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్ మరియు కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షురాలు రత్నావళి, సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ పద్మ, మనోజ్ రూపాని పాల్గొన్నారు. తన బాల్యం, ఆరోగ్య సమస్యలు, చికిత్స ప్రయాణం, వృత్తి జీవితం, వివాహం, కుటుంబ జీవితం గురించి అజయ్ ఎలాంటి దాపరికం లేకుండా మాట్లాడారు. తలసేమియా మేజర్ వల్ల ఎదురైన సవాళ్లు ఉన్నప్పటికీ, సార్థకమైన జీవితాన్ని నిర్మించుకోవడానికి తనకు తోడ్పడిన దృఢ సంకల్పం గురించి కూడా వివరించారు. తలసేమియా మేజర్‌తో దాదాపు తన 57 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, ఈ వ్యాధి తన జీవితంలో ఒక భాగం మాత్రమేనని, అది తన వ్యక్తిత్వాన్ని నిర్వచించదని అజయ్ అన్నారు. తన ప్రయాణం సఫలం కావడానికి దృఢ సంకల్పం, క్రమశిక్షణతో కూడిన చికిత్స, మెరుగైన వైద్య సంరక్షణ, కుటుంబ మద్దతు, విశ్వాసం, పట్టుదలే కారణమని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా నిరంతరాయంగా అందుకున్న చికిత్స, సంరక్షణ వల్ల సాధించిన గణనీయమైన మెరుగుదలను ఆయన ప్రస్తుత పరీక్ష ఫలితాలు కూడా తెలియజేస్తున్నాయన్నారు.

# నవంబర్ 21న కేఎస్ చిత్ర 'చిత్రామృతం - అతిపెద్ద సంగీత కచేరీ



**జూబ్లీహిల్స్,సెప్టెంబర్28(ప్రజాజ్యోతి) :** ప్రముఖ గాయని కేఎస్ చిత్ర మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రతిష్ఠాత్మక సంగీత కచేరీ 'చిత్రామృతం 3.0' నవంబర్ 21న హైదరాబాద్‌లోని నెక్సస్ మాల్ సమీపంలోని నెక్సస్ మాల్ గ్రౌండ్స్‌లో జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ లోని రామానాయుడు స్టూడియో లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోరా మరియు ఎన్ చాట్ మీడియా ఆధ్వర్యంలో ఈ కచేరీ నిర్వహించనున్నారని అన్నారు. ఇది నగరంలో కేఎస్ చిత్ర నిర్వహిస్తున్న అతిపెద్ద కచేరీ అని తెలిపారు. సుమారు 10,000 మంది ప్రేక్షకులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా కేఎస్ చిత్ర పాల్గొని, తన సంగీత ప్రయాణం, హైదరాబాద్‌తో తనకున్న అనుబంధం, రాబోయే కచేరీ విశేషాలను మీడియాతో పంచుకున్నారు. ఎన్నో తరాల ప్రేక్షకులను తన మధురమైన స్వరంతో అలరించిన చిత్ర అపూర్వమైన పాటలను ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించనుందని అన్నారు. జోరా నిర్వాహకులు వినయ్ రెడ్డి, సంజయ్ రెడ్డి మాట్లాడుతూ కేఎస్ చిత్ర చిత్రామృతం 3.0 21 నవంబర్ 2026న నెక్సస్ మాల్ గ్రౌండ్స్, నెక్సస్ మాల్ సమీపంలో, హైదరాబాద్ అతి పెద్ద సంగీత కచేరీ హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఈ కచేరీకి తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. టికెట్లు తుంపన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. చిత్ర స్వరం, ఆమె పాటలు, ఆమెతో ముడిపడిన ఎన్నో మధుర జ్ఞాపకాలను మరోసారి ప్రత్యక్షంగా ఆస్వాదించేందుకు 'చిత్రామృతం 3.0' ఒక ప్రత్యేకమైన సంగీత సాయంత్రంగా నిలవనుందని అన్నారు.

# నార్ముల్ మదర్ డైరీ పాలకవర్గ ఎన్నికలు

**కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి గెలుపు**

**మహిళ జనరల్ స్థానాన్ని గెలుచుకున్న చీర లావణ్య**



**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** నార్ముల్ మదర్ డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో రెండు స్థానాలను అధికార పక్ష(కాంగ్రెస్) మద్దతుదారులు గెలుచుకోగా ఒక స్థానంలో బీ ఆర్ ఎస్ మద్దతు దారుడు గెలుపొందారు. సోమవారం హయత్ నగర్ లోని ఎస్. వి కన్వెన్షన్ లో జరిగిన ఎన్నికల్లో రెండు జనరల్ స్థానాలను పెద్ది రెడ్డి భాస్కర్ రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, మహిళా జనరల్ స్థానాన్ని చీర లావణ్య గెలుచుకున్నారు. రెండు జనరల్ పాలకవర్గ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు గూడూరు శ్రీధర్ రెడ్డి(106), పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి (163), బెల్లి లింగస్వామి(09), శీలం వెంకట్ నర్సింహారెడ్డి (07),డి.సోమిరెడ్డి(171) లకు ఓట్లు పోలయ్యాయి. ఒక జనరల్ మహిళ రిజర్వు పాలకవర్గ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అందెం మంజుల(05), కందాల అలివేలు (46), చీర లావణ్య(190) లకు ఓట్లు పోలవగా, మరో ఏడు ఓట్లు తిరస్కరించడం జరిగింది. అనంతరం అధికారులు డి. సోమిరెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి, చీర లావణ్య లను డైరెక్టర్లుగా అధికారికంగా ప్రకటించారు. ఆలస్యంగా అధికార పక్షం మద్దతుతో భరిలోకి దిగిన గూడూరు శ్రీధర్ రెడ్డి ఓటమి పాలు కావడం గమనార్హం. 70 కోట్ల రూపాయల నష్టం తో మునివేత దిశగా పయనిస్తున్న నార్ముల్ మదర్ డెయిరీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎంతో చొరవ చూపారని చైర్మన్ మధు సూదన్ రెడ్డి అన్నారు. ఆయన పట్టుదలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి ఎన్ డీ డీ బీ కి ఎన్. ఓ. సీ ఇప్పించారని గుర్తు చేశారు. దాంతో ఎన్ డీ డీ బీ నార్ముల్ డెయిరీ తో ఒప్పందం చేసుకోవడం వల్లే రైతులకు పాల బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మాజీ చైర్మన్ శ్రీకర్ రెడ్డి వర్గీయులు చైర్మన్ ప్రసంగాన్ని అడ్డుకుంటూ ఆలేరు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ వాగ్వాదానికి దిగారు. ఒకానొక క్రమంలో మైక్ లను విరగొట్టుకుంటూ తోసుకున్నారు. సకాలంలో అక్కడకు చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను శాంతింపచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం గెలుపొందిన డైరెక్టర్ అభ్యర్థులకు చైర్మన్, ఇరు పార్టీలకు చెందిన నాయకులు అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా కోరల నుండి కాపాడండి

**పానుగంటి పర్వతాలు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు..**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి మండల పరిధిలోని కానమెట్టు సర్వేనెంబర్ 41/13 లో గల ప్రభుత్వ భూమి రెండు ఎకరాలకు పైగా ఐరన్ షీట్లు నాటి కబ్జా చేస్తున్న వారి నుండి భూమిని కాపాడాలని శేర్లింగంపల్లి మండల తహసీల్దార్ కి సిపిఐ పార్టీ.. రాష్ట్ర సమితి సభ్యులు టి రామకృష్ణ.కె చందు యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి. వినతి పత్రం ఇచ్చారు.ఈ భూమి సుమారుగా 300 కోట్ల విలువగల భూమి వెంటనే ప్రభుత్వం బ్లూ షీట్లను తొలగించి భూమిని స్వాధీనం చేసుకొని భూ కబ్జాదారులను అరెస్టు చేయాలని కోరుతూ ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు లేదా పేద ప్రజల డబల్ బెడ్ రూమ్ ల కొరకు ఉపయోగపడే విధంగా చర్యలు తక్షణమే చేయాలని ప్రభుత్వానికి అధికారులకు వినతి పత్రంతో.డిమాండ్ చేశారు ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించకపోతే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున కమ్యూనిస్టు కార్యకర్తలతో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.వినతి పత్రం అందుకున్న తహసిల్దార్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో టి రామకృష్ణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.చందు యాదవ్ సీపీఐ శేర్లింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి.కే సుధాకర్ రామస్వామి ఎస్ కొండలయ్య ఎస్.వాసు తదితరులు పాల్గొన్నారు..

# చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలి

**వైఏసీ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన**

**హైదరాబాద్ (ప్రజాజ్యోతి)** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి పెట్టాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ మరియు తెలంగాణ ఈగల్ పోలీస్ ఆధ్వర్యంలో రామంతాపూర్ అవే మరియా ఇంటర్నేషనల్ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ మహమ్మారికి అలవాటు పడితే బంగారు జీవితం నాశనం అవుతుందన్నారు. జీవితాలను నాశనం చేసే ఒక మహమ్మారి అని దానిని అదిలోనే తుంచి వేయాలన్నారు. డ్రగ్స్ లేని సమాజం విద్యార్థులతోనే సాధ్యమని, మీ చుట్టు ప్రక్కల కాని, మీ ప్రాంతంలో కాని డ్రగ్స్ వాడినట్లు అనుమానం వస్తే 1908 నంబర్ కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు.
ఉప్పల్ ఎస్ఐ మధు మాట్లాడుతూ మీరు ఒక గొప్ప ఆశయం పెట్టుకొని ముందుకు పోవాలని, డ్రగ్స్, ర్యాగింగ్ కు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్ రహిత సమాజం కోసం నేను సైతం ముందుంటానని ప్రతిజ్ఞ చేపించారు. డ్రగ్స్ వాడితే జరిగే అనర్థాలపై మొబైల్ వ్యాన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బృందం సాయి కిరణ్, రాజమ్మద్, పాఠశాల ప్రిన్సిపల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ స్ఫూర్తితో యువజన ఉద్యమాలు

**డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య**

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా భగత్ సింగ్ జయంతి**



యాచారం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ స్ఫూర్తితో యువజన ఉద్యమాలను నిర్మిస్తామని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య అన్నారు. భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. ఈ దేశ స్వాతంత్రం కోసం1931 మార్చి 23న దేశం కోసం భగత్ సింగ్ ఉరి కంభం ఎక్కారని ఆయన పుట్టి 119 ఏళ్లు అవుతున్న నిత్యం ప్రజలలో యువకులలో ఆయన స్ఫూర్తి రగులుతూనే ఉందన్నారు. ఆయన ఈ దేశానికి రాజకీయ స్వాతంత్రం కాదు సమ సమాజం నిర్మాణం కోరుకున్నారని చెప్పారు. నేటి పాలకులు ఈ దేశంలో మతం కులం పేర్లతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ యువతను విభజించి పాలిస్తున్నారు కేంద్ర ప్రభుత్వం యువతి యువకుల ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువత శక్తిని దేశానికి వినియోగించకుండా తీవ్ర నిరుద్యోగానికి కారణమవుతున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలో విద్యా వైద్యరంగంలో జరుగుతున్న అవకతవకలపై భగత్ సింగ్ స్ఫూర్తితో జన్ జీ తరం పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిల్పా డివైఎఫ్ఐ నాయకులు యాదగిరి లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# కనకమామిడి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**5వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం**

**కేఎస్ రత్నం చేతుల మీదుగా పనుల ప్రారంభం**

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి అనూష శ్రీధర్ కృతజ్ఞతలు**

**వార్డు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: అనూష శ్రీధర్**



**మొయినాబాద్ : సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలోని 5వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సోమవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి, 5వ వార్డు సభ్యురాలు అన్నెమోని అనూష శ్రీధర్‌తో కలిసి కేఎస్ రత్నం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు అన్నెమోని అనూష శ్రీధర్ మాట్లాడుతూ.. 5వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా వార్డు ప్రజల అవసరాలను గుర్తించి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్డు ప్రజలకు ఇచ్చిన మాటకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అనూష శ్రీధర్ పేర్కొన్నారు. 5వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన వార్డు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, శ్రీశైలం, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు క్యామ పద్మనాభం, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్ రెడ్డి, కంది నగేష్, సర్దానగర్ మార్కెట్ కమిటీ సభ్యుడు బాలకృష్ణ రెడ్డి, మహేందర్ రెడ్డి, వన్నాడ శివకుమార్, రవీందర్ రెడ్డి, మోర నర్సింహారెడ్డి, శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు,



# కళా రంగంలో 50 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకున్న విమలక్క



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** ఆర్టీసీ కళ్యాణ మంటపంలో, ప్రజా సాంస్కృతిక కళారంగంలో 50 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకున్న అరుణోదయ విమలక్క అభినందన కార్యక్రమంలో తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు మన్యబోయిన కృష్ణ యాదవ్. వెంకటరమణ. పేరయ్య యాదవ్. ప్రభాకర్ తదితరులు పాల్గొని ప్రజా పోరాటాలలో విమలక్క పాత్రను అభినందించారు.

# మేకగూడ పీఏసీఎస్ వివాదంలో హైకోర్టు ఆదేశాలు

**కొత్త జీవో జారీతో బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ అంబటి ప్రభాకర్**



**కొత్తూర్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పర్సన్–ఇన్–ఛార్జ్ కమిటీ నియామకంపై నడుస్తున్న సుదీర్ఘ వివాదానికి తెరపడింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన జీవోను విడుదల చేయడంతో, నూతన కమిటీ చైర్మన్‌గా అంబటి ప్రభాకర్, వైస్ చైర్మన్‌గా విఘ్నేశ్వర్ రెడ్డి,డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వను
చైర్మన్ అంబటి ప్రభాకర్

జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని సహకార శాఖ అధికారులకు అందజేసిన అనంతరం, చైర్మన్,వైస్ చైర్మన్ డైరెక్టర్లు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎరువులు, విత్తనాల పంపిణీ మరియు రైతు రుణాలు సజావుగా సాగేలా కమిటీ తో కలిసి చర్యలు తీసుకుంటామని అన్నారు.అలాగే రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు రానివ్వనని పేర్కొన్నారు.

# జంటుపల్లి ప్రాజెక్ట్ తూముల మరమ్మత్తు పనులకు నిధుల విడుదల





**యాలాల్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** జంటుపల్లి ప్రాజెక్ట్ తూముల మరమ్మత్తు పనులకు నిధుల విడుదల కావడం సంతోషంగా ఉందని సర్పంచ్ వాణిశ్రీ రమేష్ గౌడ్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.... జంటుపల్లి ప్రాజెక్ట్ తూముల మరమ్మత్తు పనులకు, కాలువల మరమ్మతు గురించి ఎమ్మెల్యే చొరవతో 5 కోట్ల 70 లక్షల నిధులు సమకూరయన్నారు. నిధులు అందించిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. జుంటుపల్లి గ్రామ ప్రజల తరపున ఎల్లప్పుడూ విధేయులమై ఉంటామన్నారు.

# చల్లబడ్డ రాజకీయం.. చతికిలబడ్డ నాయకులు..!

**ఓటు హక్కుకు దూరమవుతున్న సామాన్య ప్రజలు?**
**నామినేటెడ్ పదవులతో సరిపెట్టుకుంటున్న నాయకులు**
**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఎదురుచూపులు**

**తాండూరు, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి :-** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వ్యవహారం గ్రామీణ రాజకీయాలపై ప్రభావం చూపుతోంది. గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 లో పూర్తయినప్పటికీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ మాత్రం జాప్యానికి గురవుతోంది. గతంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినా కూడ రిజర్వేషన్ల అంశంపై న్యాయస్థానం పరిధిలో ఉండటంతో ఆ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఎన్నికలు వాయిదా పడటంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయంగా చురుగ్గా ఉండే నాయకులు, ఆశావహులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల కోసం చాలాకాలంగా ప్రజల్లో తిరుగుతున్న నాయకులకు ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత లేకపోవడం రాజకీయ కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం 2025 సెప్టెంబర్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా, అనంతరం ఆ ప్రక్రియను పూర్తి చేయకుండానే అర్థం గా నిలిపివేసింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఆశల వదులుకున్న నాయకులు నామినేటెడ్ పదవుల చుట్టూ ఆశలు పెట్టుకుని సరిపెట్టుకుంటున్నారు. ఎన్నికల ద్వారా ప్రజల తీర్పు పొందాల్సిన నాయకత్వానికి అవకాశం లేకుండా కాలయాపన చేయడంతో పలువురు ఆశావహులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారిస్తున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా ఉంది. అయితే నామినేటెడ్ పదవులు పరిమితంగా ఉండటంతో ఆశావహుల సంఖ్య కూడ బాగా పెరుగుతుంది. కొన్నే ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు తమ రాజకీయ భవిష్యత్తుపై అయోమయంలో ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

**ఎన్నికలపై స్పష్టత ఎప్పుడో?**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విషయంలో ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన షెడ్యూల్ కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రాజకీయ నాయకులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు జరిగితేనే స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజల ప్రత్యక్ష తీర్పు లభిస్తుందని, గ్రామీణ రాజకీయాల్లో మళ్లీ చైతన్యం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత రెండు నెలలకు పైగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వే పై స్పష్టత లేకపోవడం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. ఎన్నికల నిర్వహణపై స్పష్టత రావడం కోసం రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



# ప్రకృతి పరిరక్షణతోనే బాధ్యతాయుత పర్యాటకం

**జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ బత్తుల**
**అనంతగిరిలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం**

**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అనంతగిరిలోని మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన సుమారు 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యత, ప్రకృతి- పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం, బాధ్యతాయుతమైన పర్యాటకంపై అవగాహన కల్పించారు. ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ఆధ్వర్యంలో పాముల ప్రదర్శన ఏర్పాటు చేసి, పాముల ప్రాముఖ్యత, సంరక్షణ, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థినులను శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం, మూసీ నది పుట్టిన ప్రదేశం, అనంతగిరి ఎకో-అర్బన్ పార్క్, చెత్రి వ్యూ పాయింట్ తదితర పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లారు. అనంతగిరి అటవీ ప్రాంతంలో నేచర్ వాక్ నిర్వహించి అడవుల ప్రాధాన్యత, జీవవైవిధ్యం, ప్రకృతి వనరుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ బత్తుల బాధ్యతాయుతమైన పర్యాటకం - ఆరోగ్యకరమైన అడవులు- అభివృద్ధి చెందిన సమాజం" అనే సందేశంతో పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచడంతో పాటు ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. నాగేశ్వర్ రావు, సోషల్ వర్కర్ కె.వి.ఎం. వెంకట్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# దుద్యాల్ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీ

**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి):** దుద్యాల్ పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సోమవారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, క్రైమ్ వివరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధులు, బీట్ వ్యవస్థ, ఫిర్యాదుల స్వీకరణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి పకడ్బందీగా దర్యాప్తు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, కోర్టు కేసుల్లో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సీసీ కెమెరాలు, సీసీటీఎన్ఎస్ నమోదు, ఆయుధాలు, ప్రభుత్వ ఆస్తుల భద్రత, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్పీ, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. సైబర్ నేరాలు, ఎన్‌డీపీఎస్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం పిన్, సీవీవీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోకుండా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ తెలిపారు.




# అర్హత ఉన్న చేయూత పెన్షన్ ఇవ్వరా!


**10 ఏండ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూపులు**
**బుడిగజంగం భాగ్యమ్మకు పెన్షన్ మంజూరు చేయాలి**
**అంబేద్కర్ ప్రజా సంఘం డివిజన్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్**

**తాండూరు సెప్టెంబర్ 28ప్రజా జ్యోతి :-** అర్హత ఉన్నా కూడా ప్రభుత్వం ద్వారా అందించాల్సిన (ఆసరా )చేయిత పెన్షన్ మంజూరు చేయకపోవడం దురదృష్టకరమని అంబేద్కర్ ప్రజా సంఘం తాండూరు నియోజకవర్గం కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్ ఆవేదన వ్యక్తపరిచారు. సోమవారం రోజు తాండూరు పట్టణం మాణిక్ నగర్ కు చెందిన బుడగ జంగం భాగ్యమ్మకు వెంటనే వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ తాండూరు ఆర్డీవో కార్యాలయం జరిగిన ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ భర్త చనిపోయి పది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వం ద్వారా అందాల్సిన( ఆసరా) చేయూత పెన్షన్ మంజూరు చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. లేని పోనీ సంబంధంలేని కారణాలు చూపిస్తూ 14వ వార్డు అభివృద్ధి అధికారి పింఛన్ నిలిపివేస్తున్నట్లు హెచ్చరించడం ఏమిటని ఆరోపించారు. దళితులంటే అధికారులకు ఎందుకు ఇంత చిన్నచూపు అని ప్రశ్నించారు. 62 సంవత్సరాల వృద్ధురాలిని మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే అధికారుల పైన ఆందోళన కార్యక్రమాలు చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం డివిజన్ నాయకులు మోడెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఒకే లైసెన్స్‌తో మూడు గ్రామాల్లో కల్లు దుకాణాలు

**దామర్లపల్లి లైసెన్స్‌తో పక్క గ్రామాల్లోనూ కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు**
**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పెదవేడు గ్రామస్తులు, పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి**




**షాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రజాజ్యోతి )** షాబాద్ మండల పరిధిలోని ఒక గ్రామపంచాయతీ పరిధిలో జారీ చేసిన కల్లు దుకాణం లైసెన్స్‌ను ఆధారంగా చేసుకుని పక్కనే ఉన్న పలు గ్రామాల్లోనూ కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. షాబాద్ మండలంలోని దామర్లపల్లి గ్రామపంచాయతీ పేరుతో ఉన్న లైసెన్స్‌తో పెదవేడు, నాందార్ఖాన్‌పేట్, లింగారెడ్డి గూడ, తదితర గ్రామాల్లో కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నారంటూ పెదవేడు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై పెదవేడు గ్రామస్తులతో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఒకే లైసెన్స్‌తో వేర్వేరు గ్రామాల్లో దుకాణాలు నిర్వహించడంపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.లైసెన్స్ ఏ గ్రామానికి, ఏ ప్రదేశానికి మంజూరైంది? అదే లైసెన్స్‌తో ఇతర గ్రామాల్లో దుకాణాలు నిర్వహించేందుకు నిబంధనల్లో అనుమతి ఉందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ విషయంపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించారా లేదా అన్నది తేల్చాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

# ఎక్సైజ్ శాఖకు వెపన్స్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** క్యూర్ పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సమీక్ష సమావేశం.ఎక్సైజ్‌శాఖకు వెపన్స్ కోసం ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించడానికి సమగ్ర సమాచారాన్ని తీసుకోవడానికి క్యూర్ పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇవ్వడానికి అనుమతి ఇస్తే ఏ స్థాయి అధికారులకు వెపన్లు ఇవ్వాలని అనే విషయంపై ఎక్సైజ్ శాఖ అధికారుల అభిప్రాయాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.ఎక్సైజ్‌శాఖకు ప్రభుత్వం వెపన్లు ఇస్తే పోలీస్ శాఖతో కోర్డినేషన్ చేసుకుంటు వెళ్లాల్సి ఉంటుందని కమిషనర్ అదేశించారు.ఎక్సైజ్‌శాఖ ఎన్‌డీపీఎస్ (డ్రగ్స్), ఎన్‌డీపీఎస్ (నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్)పై పూర్తి స్థాయిలో నిఘా పెట్టి, అరికట్టడడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ అదేశించారు. బార్స్, మద్యం షాపులకు సంబంధించిన ఎక్సైజ్ రెంటల్ ఫీజ్‌ను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు.కొత్త బార్ల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి అవసరమైన సౌకర్యాల కల్పన చేపట్టాలని, దరఖాస్తుదారులకు ఎక్సైజ్ అధికారులు తగిన గైడెన్స్ ఇవ్వాలని కమిషనర్ అదేశించారు.ఈ సమావేశంలో అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషి, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ జి. అంజన్‌రావు, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ డిప్యూటి కమిషనర్లు ఏ. శ్రీనివాసరెడ్డి, జె. హరికిషన్,టీజీబీసీఎల్ డిప్యూటి కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ హెడ్ క్వార్టర్స్ శీలం శ్రీనివాస్,అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాస్, జి.శ్రీనివాసరెడ్డి, కె.ప్రదీప్‌రావు తోపాటు ఈఎస్‌లు ఉన్నారు.

# విద్యుత్ ఉద్యోగిపై వినియోగదారుడు దాడి

**వినియోగదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సిబ్బంది ధర్నా**





**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** విద్యుత్ ఉద్యోగిపై ఒక వినియోగదారుడు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించాడంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనిపై దాడికి పాల్పడ్డాడు. విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల్లోకి వెళితే సరూర్నగర్ పోచమ్మ బాగ్ కు చెందిన శివ నివాసంలో ఒక ఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆదివారం ఉదయం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో విద్యుత్ అధికారులు మరో పనులపై బిజీగా ఉన్న నేపథ్యంలో శివ నివాసంలో విద్యుత్ సరఫరాను పునరుద్దించడంలో ఆలస్యం చోటుచేసుకుంది. దీంతో సదరు వినియోగదారుడు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని కోపంతో సరూర్నగర్ విద్యుత్ ఏఈ కార్యాలయానికి చేరుకొని ఆపరేటర్ తో శివ వాగ్వాదానికి దిగాడు.ఈ సమాచారం అందుకున్న ఈ సమాచారం అందుకున్న ఏఈతో పాటుగా గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన విద్యుత్ ఉద్యోగి రాజిరెడ్డి సరూర్నగర్ సెక్షన్ కార్యాలయానికి చేరుకున్నారు. సమస్య ఏంటని ప్రశ్నిస్తున్న క్రమంలోనే వినియోగదారుడు శివ తీవ్రమైన పదజాలంతో రాజిరెడ్డిని దూషించడంతోపాటు తీవ్ర ఆగ్రహానికి గురై ఓ కర్రతో రాజిరెడ్డి పై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన రాజిరెడ్డి సరూర్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా విద్యుత్ సిబ్బంది తెలిపారు. సోమవారం విద్యుత్ ఉద్యోగుపై దాడికి నిరసనగా సదరు వినియోగదారుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలంటూ సరూర్ నగర్ డివిజన్ కార్యాలయం ముందు విద్యుత్ సిబ్బంది ధర్నా చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఎస్ ప్రభాకర్, ఈశ్వర్ రావు, ప్రకాష్ చారి, శ్రీకాంత్ రెడ్డి, పెద్దలు, శ్రావణ్ కుమార్, జై సుధన్ రెడ్డి, ఉదయ్ కుమార్, బలరాములు, సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ మాదిరి.. రేవంత్



**హైదరాబాద్ :** తెలంగాణలో త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక కేవలం ఒక సాధారణ నియోజకవర్గ పోరుగానే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపే హై-వోల్టేజ్ ఫైట్ గా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ఆయన వ్యూహాత్మక ఎత్తుగడలకు ఈ ఎన్నిక ఒక పెద్ద సవాల్‌గా నిలవనుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లను, నేటి రేవంత్ రెడ్డి రాజకీయ శైలితో బేరీజు వేస్తూ విశ్లేషకులు ఈ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చూస్తున్నారు. ఒకప్పుడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే తరహా రాజకీయ పరిణామాలు తలెత్తాయి. అప్పుడు దానం నాగేందర్ టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫ్ నగర్ ఉపఎన్నిక బరిలో నిలిచారు. అయితే ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు. అప్పట్లో వైఎస్సార్ ఆ ఎన్నికను వ్యక్తిగతంగా తీసుకోలేదని, అందుకే ఓడిపోయారని చెప్పుకునేవారు. అయితే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న రేవంత్ రెడ్డి ప్రతి చిన్న పరిణామాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలిస్తూ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భవిష్యత్ ఎన్నికల దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, అధికార పార్టీ తరఫున ఆయనే బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఖైరతాబాద్ గడ్డపై త్రిముఖ పోరు అనివార్యంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఈ ఉపఎన్నికను తమ సత్తా చాటుకునేందుకు సరైన వేదికగా భావిస్తున్నాయి. 2028 అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ ఉపఎన్నిక ఒక లిట్మస్ టెస్ట్ లాంటిదని అన్ని పార్టీలు నమ్ముతున్నాయి. ఒకవైపు అధికార పార్టీగా సంక్షేమ పథకాలు, పాలనాపరమైన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో తమ పట్టును నిరూపించుకోవడానికి ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉందనే ధీమాతో ఉన్న దానం, ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొనేందుకు సరికొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళి, పోలీసులు, స్థానిక ప్రజల స్పందన అన్నీ కూడా రాజకీయంగా ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఈ ఉపఎన్నిక కేవలం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాదు, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమను కూడా పరీక్షించనుంది. గతంలో వైఎస్సార్ ఎదుర్కొన్న రాజకీయ అడ్డంకులను అధిగమించి, ఈసారి రేవంత్ రెడ్డి సరికొత్త చరిత్రను తిరగరాస్తారా లేదా అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాం శమైంది. స్వయంగా సీఎం రంగంలోకి దిగి ప్రచార వ్యూహాలను పర్యవేక్షించే అవకాశం ఉండటంతో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కాస్త కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది.

# పాడిపై వేటు తప్పదా...



**హైదరాబాద్ :** పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ద్వారానే అనర్హత వేటు వేయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని బీఆర్ ఎస్ నాయకులు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇదే జరిగితే.. ఖైరతాబాద్‌తో పాటు హుజూరాబాద్కు కూడా ఒకే సారి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని అంచనా అంటున్నారు. అయితే.. దీనిని కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య అని బీఆర్ ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాదు.. సభను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తంగా ఇప్పుడు పాడి చుట్టూ రాజకీయం మరోసారి రాజుకుంది. ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో పాడి కౌశిక్ రెడ్డి సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ నుంచి గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అడ్డుకోవడంతోపాటు.. "నువ్వు" అని ఏకవచనంతో సంబోధించారు. అంతేకాదు.. దుర్భాషలాడారన్నది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణ. అంతేకాదు.. తనను కాల్చేస్తానని కౌశిక్ రెడ్డి బెదిరించినట్టు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కడియం ఆరోపిస్తున్నారు. దీంతో వ్యవహారం ముదిరిపోయి.. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి ఈ విషయాన్ని రిఫర్ చేశారు. ప్రస్తుతం ఈ కమిటీ తీవ్రంగా శోధిస్తోంది. పాడిపై వచ్చిన ఆరోపణలు, ఆయన హావభావాలను వీడియోల రూపంలో కూడా పరిశీలన చేస్తోంది. కాగా.. ఇంతలోనే దానం వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు పాడి విషయం మరింత సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ తీసుకునే నిర్ణయం అత్యంత ముఖ్యంగా మారడంతో పాడిపై వేటు వేయించడమో.. లేక రాజీనామాకు సిఫారసు చేయడమో ఖాయమని అంటున్నారు ఎథిక్స్ కమిటీ అనేది రాజ్యాంగ బద్ధమైన కమిటీ కావడం, దీనికి స్పీకర్ అనుమతి ఉండడంతో ఈ కమిటీ నిర్ణయాన్నికోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదని అంటున్నారు. పాడి అనర్హుడు కావడమో.. రాజీనామా చేయడమో తప్పదు. దీంతో హుజూరాబాద్‌కు కూడా ఉప ఎన్నిక తీసుకురావాలన్నది కాంగ్రెస్ ప్లాన్‌గా చెబుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. తను వివరణ ఇచ్చేందుకు ఆరు వారాలు గడువు ఇవ్వాలంటూ..పాడి కోరి మూడు వారాలైంది. దీంతో మరో రెండు వారాల్లోనే ఆయనపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది

# వైసీపీ ట్రాప్‌లో లోకేశ్




**రాజమండ్రి :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.. విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా? రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు. అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది. రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ-బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండి స్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపా రేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## తాండూర్ ప్రజల ఆదరణ సంతృప్తినిచ్చింది

**సామాజిక సేవతో ప్రజలకు చేరువయ్యా**

**అవకాశం వస్తే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా**



**బషీరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** తాండూర్ నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందని కంజర్ల విజయలక్ష్మి అన్నారు. సోమవారం బషీరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాండూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాలు, మహిళలకు అన్నలకు తమ్ములకు రాఖీలు, గుండె జబ్బు సిపిఆర్ గురించి అవగాహన కార్యక్రమం చిన్నారులకు వివిధ కార్యక్రమాలతో పాటు వెనుకబడిన కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ ప్రజలకు తన వంతు సేవ చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గర కావడం, వారి ఆదరణ పొందడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజా సేవను కొనసాగిస్తానని తెలిపారు. తగిన అవకాశం లభిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉందని కంజర్ల విజయలక్ష్మి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షేక్ సైబన్ అనిల్ కుమార్ గౌడ్ వ వడ్డేజగదీష్ అస్లాం కంజర్ల ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతున్న కంజర్ల విజయలక్ష్మి

**14 వార్డుల్లో 54 మంది గర్భిణులకు శ్రీమంతం కానుకలు**




**బషీరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** బషీరాబాద్ మండల కేంద్రంలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా 14 వార్డుల్లోని 54 మంది గర్భిణుల ఇళ్లకు స్వయంగా వెళ్లి శ్రీమంతం కానుకలను అందజేశారు.

ప్రతి గర్భిణి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో కానుకలు అందించగా, పలువురు మహిళలు కంజర్ల విజయలక్ష్మికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ ఇంటి వద్దకు వచ్చి శ్రీమంతం కానుకలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు, వెనుకబడిన కుటుంబాలను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డే జగదీష్ షేక్ సైబాన్ అనిల్ కుమార్ గౌడ్ అస్లాం కంచర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**పరిగి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** పరిగి మండలంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన 152 చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.